# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

24.03.2026 మంగళవారం Tuesday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 243 | పేజీలు : 10 Pages : 10 | వెల రూ.2.00 | Published from : Hyderabad Circulated to : Telangana



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789




వివరాలు 5వ పేజీలో

# చట్టం తన పని తాను చేసుకుపోతున్నట్టేనా!?

మెట్‌పల్లిలో పోలీసుల దాడుల్లో పట్టుబడ్డ ఓ ఏఎస్ఐ, ఎండోమెంట్ రిటైర్డ్ అధికారి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌తో పాటు మరో ఏడుగురు?

ట్విస్ట్‌తో సంచలనం


పోలీసులపై 'రాజకీయ ఒత్తిళ్లపై గుసగుసలు

## మూసీ ప్రక్షాళన..
# సామాన్యుడికి భరోసా!

### ఎవరికీ నష్టం జరగదు.. సీఎం హామీ

మెరుగైన వసతులతో పునరావాసం ▪ కాలుష్య రహిత నగరమే లక్ష్యం

భాగ్యనగరానికి పూర్వవైభవం ▪ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు వల్ల పరివాహక ప్రాంత ప్రజలెవరూ నిరాశ్రయులు కారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనమండలి సాక్షిగా భరోసా ఇచ్చారు. ఏ ఒక్కరికీ నష్టం జరగకుండా వారందరికీ ప్రభుత్వం మెరుగైన వసతులతో కూడిన పునరావాసం కల్పిస్తుందని ఆయన స్పష్టం చేశారు. మండలిలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానమిస్తూ మూసీ ప్రజలను ఆదుకునే పూర్తి బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు ప్రణాళికలను క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలకు మేలు చేసే సలహాలు సూచనలు ఇస్తే ప్రభుత్వం వాటిని తప్పనిసరిగా అమలు చేస్తుందని వివరించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ఉద్దేశించిన తెలంగాణ రైజింగ్ 2047 దార్శనికతను ఈ సందర్భంగా ఆయన సభ ముందు ఉంచారు.

మిగతా 2 లో



## బడ్జెట్‌లో కోతలు.. రైతులకు వాతలు!

• హామీల అమలు ఎక్కడ? • రైతులకు కాంగ్రెస్ దగా

• హరీశ్‌రావు ధ్వజం • ఆదాయం పెంపుపై నిలదీత!

2

## గ్యారంటీలకు చట్టబద్ధత.. బీఆర్ఎస్ పట్టు

అసెంబ్లీలో ప్రైవేట్ బిల్లుకు నోటీసు

2



## పశ్చిమాసియా సంక్షోభం..
# భారత్‌కు సవాళ్లు

- యుద్ధ ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్రంగా పడే అవకాశం
- గల్ఫ్‌లో భారతీయుల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు
- ఇంధన సరఫరా, నిల్వలపై కేంద్రం అప్రమత్తం
- లోక్‌సభలో ప్రధాని మోదీ


4



## మోదీ రాజీ

పార్లమెంటులో చర్చకు రావడం లేదు: రాహుల్

4



## భారీగా తగ్గిన బంగారం ధరలు

యుద్ధ ప్రభావంతో దిగివస్తున్న రేట్లు

.. వివరాలు 4లో



## ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు హైకోర్టు నోటీసులు

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు కూడా నోటీసులు జారీ

అనర్హత వేటు వేయాలన్న బీజేపీ పిటిషన్‌పై విచారణ

తదుపరి విచారణ ఏప్రిల్ 16వ తేదీకి వాయిదా

14

## పీజీ మెడికల్ సీట్ల భర్తీపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

14



## చెన్నూర్ మద్యం సిండికేట్ మాఫియా
# వెనుక ఎవరు..



• ధాబాల పేరుతో జోరుగా విక్రయాలు.. పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండల కేంద్రంతో పాటు కోటపల్లి మండలంలోని పలు గ్రామాల్లో మద్యం విక్రయాలు నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్నాయి. వైన్ షాపుల యజమానులందరూ ఒక సిండికేట్‌గా ఏర్పడి, ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. చెన్నూర్‌కు చెందిన ఒక వ్యక్తి ఆధ్వర్యంలో ఈ సిండికేట్ నడుస్తున్నట్లు సమాచారం. గత కొన్నేళ్లుగా సాగుతున్న ఈ అక్రమ దందాపై ఎక్సైజ్ శాఖ అధికారులు కనీసం కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

13

## రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ వ్యవహారం

### ఆర్థిక కార్యదర్శిపై హైకోర్టు ఆగ్రహం

**హైదరాబాద్, మార్చి 23:** రిటైర్డ్ ఉద్యోగులకు వెంటనే బెనిఫిట్స్ చెల్లించాలని కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ, ఏడాదిగా బెనిఫిట్స్ ఇవ్వకపోవడంతో ఆర్థిక కార్యదర్శి పై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈరోజు అర్ధరాత్రి వరకైనా కోర్టులోనే ఉంటాం.. ఆర్థిక కార్యదర్శి వ్యక్తిగతంగా కోర్టులో హాజరు కావాల్సిందేనంటూ ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలను దిక్కరించిన ఆర్థిక కార్యదర్శిపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని బాధితులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా సోమవారం వారి పిటిషన్‌కు విచారణకు వచ్చింది. ఈ పిటిషన్ విచారిస్తూ సోమవారం కోర్టులో వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆర్థిక కార్యదర్శికి ఆదేశించినప్పటికీ, కోర్టుకు రాకపోవడంతో న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల కారణంగా కోర్టుకు హాజరు కాలేకపోయారని ప్రభుత్వ న్యాయవాది సమాధానమిచ్చారు. అసెంబ్లీ సమావేశాలు ఉన్నాయని ముందే తెలుసు కదా. రాలేనని ముందే చెప్తే మినహాయింపు ఇచ్చేవాళ్ళం. కానీ ఈరోజు ఎంత రాత్రయినా ఆర్థిక కార్యదర్శి కోర్టులో హాజరు కావాల్సిందేనని న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

## గ్యారంటీలకు చట్టబద్ధత.. బీఆర్ఎస్ పట్టు

### అసెంబ్లీలో ప్రైవేట్ బిల్లుకు నోటీసు

**హైదరాబాద్, మార్చి 23:** ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించేందుకు బీఆర్ఎస్ ప్రైవేటు బిల్లు ప్రతిపాదించింది. ఈ మేరకు ఆ పార్టీ ఎమ్మెల్యేలు శాసనసభ కార్యదర్శికి నోటీసులు ఇచ్చారు. అంతేకాకుండా బిల్లు ప్రతిని సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌కు అందజేశారు. బిల్లును ఈ సమావేశాల్లోనే అనుమతించాలని కోరారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే ప్రైవేట్ మెంబర్ బిల్లుకు సంబంధించిన నోటీసును స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ ఎమ్మెల్యేలు అందజేశారు. ఈ ప్రైవేట్ మెంబర్ బిల్లుతో ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే అవకాశం ఉంటుందని కేటీఆర్ వెల్లడించారు. అత్యంత కీలకమైన ఈ బిల్లును ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రవేశపెట్టడానికి అనుమతించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. స్పీకర్‌తో పాటు అసెంబ్లీ సెక్రటరీకి కూడా బిల్లుకు సంబంధించిన నోటీసులు అందజేశారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు జగదీష్ రెడ్డి, మల్లారెడ్డి, కేపీ వివేకానందా, సుధీర్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, చింతా ప్రభాకర్, అనిల్ జాదవ్, మాణిక్ రావు, దాసోజు శ్రవణ్‌కుమార్, శంభీపూర్ రాజు, మాధవరం కృష్ణారావు, కల్వకుంట్ల సంజయ్, కౌశిక్ రెడ్డి తదితరులున్నారు.

## బడ్జెట్‌లో కోతలు.. రైతులకు వాతలు!

- హామీల అమలు ఎక్కడ?
- రైతులకు కాంగ్రెస్ దగా
- హరీశ్‌రావు ధ్వజం
- ఆదాయం పెంపుపై నిలదీత.... !



**హైదరాబాద్, మార్చి 23:** గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క సీజన్ కూడా ఎగ్గొట్టకుండా రైతుబంధు ఇచ్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఎకరానికి 15 వేల రూపాయలు ఇస్తామని ఈ ప్రభుత్వం ఎన్నికల అజెండాలో, తొలి బడ్జెట్‌లో ప్రకటించి, ఆ తర్వాత దానిని 12 వేల రూపాయలకు తగ్గించారని మండిపడ్డారు. మూడో పంటకు రైతుబంధు ఇవ్వాలని అడిగిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఒక సీజన్‌కే ఇస్తున్నారని విమర్శించారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా హరీశ్‌రావు శాసనసభలో మాట్లాడుతూ ఒక సీజన్ రైతు భరోసా ఎగ్గొట్టి రుణామాఫీ చేశామని గొప్పలు చెప్పుకున్నారని ఎద్దేవా చేశారు.

### రైతుబంధుపై నిలదీత

మొదటి బడ్జెట్‌లో పెట్టినట్లు ఎకరాకు 15 వేల రూపాయల చొప్పున రైతు భరోసా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో పెట్టినవి కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటు అని వ్యాఖ్యానించారు. ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రైతుభరోసా, పంటల బోనస్ ఇస్తున్నారని ఆరోపించారు. రెండు బడ్జెట్లలో పెట్టిన పంటల బీమా ఈ బడ్జెట్‌లో మాయమైందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు కూలీలకు ఏడాదికి 12 వేల రూపాయలు ఇస్తామని రెండు బడ్జెట్‌లలో పెట్టినా ఒక్కసారి కూడా ఇవ్వలేదని తప్పుబట్టారు. జాబ్ క్యాలెండర్ త్వరలోనే ప్రారంభిస్తామని గత బడ్జెట్‌లో చెప్పి ఇప్పుడు ఆ ప్రస్తావనే లేదని దుయ్యబట్టారు.

### కాంగ్రెస్ సర్కారుపై నిప్పులు

అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ సర్కారుపై నిప్పులు చెరుగుతూ ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో లోపాలను ఆయన ఎండగట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క సీజన్ కూడా ఆపకుండా రైతుబంధు ఇచ్చామని గుర్తు చేశారు. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే మూడు సీజన్‌లలో రైతు భరోసాను ఎగ్గొట్టిందని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు ఎన్నికల ప్రచారం సమయంలో తాము అధికారంలోకి వస్తే ఎకరానికి 15 వేల రూపాయల రైతుబంధు ఇస్తామని హామీ ఇచ్చారని, ఈ మేరకు ఎన్నికల అజెండాలో కూడా పెట్టారని హరీశ్‌రావు గుర్తుచేశారు. తొలి బడ్జెట్‌లో ప్రకటించి ఆ తర్వాత దానిని 12 వేల రూపాయలకు తగ్గించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### హామీల ఉల్లంఘన

గతంలో తమ ప్రభుత్వాన్ని మూడో పంటకు కూడా రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేసిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఒకే పంటకు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. ఏటా ఒక సీజన్‌కే రైతు భరోసా ఇస్తూ రుణామాఫీ చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. మొదటి బడ్జెట్‌లో పెట్టినట్లుగా ఎకరాకు 15 వేల రూపాయల చొప్పున రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో పెట్టిన అంశాలను కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటు అని పేర్కొన్నారు. ఎన్నికల సమయాల్లోనే రైతులకు వరాలు ప్రకటిస్తున్నారని విమర్శించారు. రెండు బడ్జెట్లలో ఉన్న పంటల బీమా పథకం ఈ బడ్జెట్‌లో మాయం కావడాన్ని ఆయన ప్రశ్నించారు.

### మాయమైన పథకాలు

రైతు కూలీలకు ఏడాదికి 12 వేల రూపాయలు ఇస్తామని కూడా రెండు బడ్జెట్‌లలో పెట్టారని, కానీ ఒక్కసారి కూడా అమల్లోకి రాలేదని చెప్పారు. జాబ్ క్యాలెండర్ ప్రస్తావన ఈ బడ్జెట్‌లో లేకపోవడాన్ని తప్పుబట్టారు. అలాగే ఎక్సైజ్ ఆదాయాన్ని వచ్చే ఏడాదికల్లా 12 వేల కోట్ల రూపాయలు పెంచుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రస్తుతం 34 వేల కోట్లుగా ఉన్న అబ్కారీ ఆదాయాన్ని 46 వేల కోట్లకు ఎట్లా పెంచుతారని నిలదీశారు. ఇందుకోసం ఊరూరుకు బార్లు తెరుస్తారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

### ఆదాయం పెంపుపై నిలదీత

ఈ సమయంలో ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు కలుగజేసుకుని కాంగ్రెస్ హయాంలో 12 వేల కోట్లుగా ఉన్న ఆదాయాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం 36 వేల కోట్లు పెంచిందని చెప్పారు. జూపల్లి జోక్యం చేసుకోవడంపై హరీశ్‌రావు అసహనం వ్యక్తం చేశారు. తన ప్రశ్నకు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సమాధానం చెప్పాలని కోరారు. తాను బడ్జెట్‌పై ప్రశ్నలు అడుగుతున్నానని, కేవలం ఎక్సైజ్ శాఖకు సంబంధించిన అంశం కాదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ జోక్యం చేసుకుని ప్రభుత్వ తీరును తీవ్రంగా విమర్శించారు.

## పెన్షనర్ల వేదన.. బీఆర్ఎస్ వాకౌట్!

### బకాయిల చెల్లింపులో ప్రభుత్వ నిర్లక్ష్యం

### అసెంబ్లీలో గళమెత్తిన విపక్ష సభ్యులు

**హైదరాబాద్, మార్చి 23:** ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాల విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిరసనగా బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చూపిస్తున్న మోసపూరిత వైఖరికి నిరసనగా సభ నుంచి వెళ్లిపోయారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ బెనిఫిట్స్ ఇవ్వడంలో అలసత్వం వహించడం, పీఆర్సీ డీఏ విషయంలో సీపీఎస్ విషయంలో, ఉద్యోగుల పట్ల ఈ ప్రభుత్వం చూపిస్తున్న మోసపూరిత వైఖరికి సభ నుండి వాకౌట్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గళమెత్తారు. వారి పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు కేపీ వివేకానందా, కల్వకుంట్ల సంజయ్ సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్ నెలకు 700 కోట్ల రూపాయల బకాయిలను చెల్లిస్తామని చెప్పి, ఇంతవరకు చెల్లించలేదని ఆరోపించారు. ఎంతోమంది ఉద్యోగులు వారి మనోవేదనను చెప్పుకోలేక, ఆరోగ్య సమస్యలతో చనిపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. రిటైర్డు ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ ఎప్పుడు అమలు చేస్తారని, 5 డీఏలు ఎప్పుడు ఇస్తారని ఎమ్మెల్యే సంజయ్ ప్రశ్నించారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో స్పష్టం చేయాలని కోరారు.

## మూసీ ప్రక్షాళన.. సామాన్యుడికి భరోసా!

**ఎవరికీ నష్టం జరగదు.. సీఎం హామీ**

- మెరుగైన వసతులతో పునరావాసం
- కాలుష్య రహిత నగరమే లక్ష్యం
- భాగ్యనగరానికి పూర్వవైభవం



**హైదరాబాద్, మార్చి 23:** మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు వల్ల పరివాహక ప్రాంత ప్రజలెవరూ నిరాశ్రయులు కారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనమండలి సాక్షిగా భరోసా ఇచ్చారు. ఏ ఒక్కరికీ నష్టం జరగకుండా వారందరికీ ప్రభుత్వం మెరుగైన వసతులతో కూడిన పునరావాసం కల్పిస్తుందని ఆయన స్పష్టం చేశారు. మండలిలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానమిస్తూ మూసీ ప్రజలను ఆదుకునే పూర్తి బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు ప్రణాళికలను క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలకు మేలు చేసే సలహాలు సూచనలు ఇస్తే ప్రభుత్వం వాటిని తప్పనిసరిగా అమలు చేస్తుందని వివరించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ఉద్దేశించిన తెలంగాణ రైజింగ్ 2047 దార్శనికతను ఈ సందర్భంగా ఆయన సభ ముందు ఉంచారు.

### మహానగరాల అనుభవాలు

దేశంలోని ఢిల్లీ ముంబై బెంగళూరు చెన్నై వంటి నగరాల్లో తలెత్తుతున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌ను అద్భుతమైన నగరంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. ముంబైలో వర్షాలు కురిస్తే నివసించలేని పరిస్థితి ఢిల్లీలో తీవ్రమైన కాలుష్యం బెంగళూరులో ట్రాఫిక్ ఇబ్బందులు చెన్నైలో నీటి ముంపు వంటి పరిస్థితులను మనం గమనించాలని సూచించారు. నల్గొండ ప్రజల కష్టాలను వారి ఆవేదనను గమనించే వారెవరూ ఈ ప్రాజెక్టును ఆపాలని కోరుకోరని ఆయన అన్నారు. సలహాలు తీసుకోవడానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్‌లతో కూడిన మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమిస్తామని ప్రకటించారు. ఏ రాష్ట్ర ప్రగతి అయినా ఆ రాష్ట్ర నగరాలు పెట్టుబడులు ప్రజల జీవన స్థితిగతులపై ఆధారపడి ఉంటాయని గుర్తు చేశారు.

### కాలుష్య రహిత కార్యాచరణ

తెలంగాణను క్యూర్ ప్యూర్ రేర్ అనే మూడు ప్రాంతాలుగా విభజించి సమగ్ర ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు వెళుతోంది. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను వెలుపలికి తరలించాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. దీనివల్ల నగరం కాలుష్య రహితంగా మారుతుందని హిల్ట్ పాలసీ ద్వారా ఇక్కడి భూములను మల్టీయూజ్ జోన్లలోకి మారుస్తున్నామని చెప్పారు. దీనివల్ల భూ యాజమాన్య హక్కులు మారకుండా మధ్య తరగతి నివాస ప్రాంతాలుగా అభివృద్ధి చెందుతాయని వివరించారు. పరిశ్రమల తరలింపు ద్వారా నగరాన్ని సర్వీస్ సెక్టార్ హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. కులీకుతుబ్ షాహీల కాలం నాటి చారిత్రాత్మక కట్టడాల వైభవాన్ని కాపాడుతూనే ఆధునిక సమస్యలకు పరిష్కారం చూపుతామని అన్నారు.

### గోదావరి నీటితో ప్రక్షాళన

గోదావరి నుంచి ఇరవై టీఎంసీల నీటిని తరలించి అందులో పదిహేడు టీఎంసీలను జంటనగరాల తాగునీటి అవసరాల కోసం వినియోగిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. మిగిలిన మూడు టీఎంసీల నీటిని మూసీ నదిలో నిరంతరం ప్రవహించేలా చూస్తామని దీనివల్ల మూసీ ప్రాజెక్టు నూతన రూపును సంతరించుకుంటుందని చెప్పారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రభుత్వం ఒక పటిష్టమైన రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేసుకుందని ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడంలో అందరూ సహకరించాలని కోరారు. ఏ ఒక్కరికీ నష్టం కలగకుండా పారదర్శకమైన పద్ధతిలో పునరావాస పనులు పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. మానవ తప్పిదాల వల్ల కలిగిన కాలుష్యాన్ని దూరం చేసి రేపటి తరానికి స్వచ్ఛమైన హైదరాబాద్‌ను అందిస్తామని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు.

## మెట్రో మ్యాజిక్.. హైదరాబాద్‌కు మహర్దశ!

- రూ. 24 వేల కోట్లతో రెండో దశ
- రన్‌వే కింద అండర్ టన్నెల్
- ఎయిర్‌పోర్ట్‌కు మెట్రో అనుసంధానం
- ట్రాఫిక్ ఫ్రీ సిటీయే లక్ష్యం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి 23:** హైదరాబాద్ నగర జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో భాగంగా ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించడానికి మెట్రో విస్తరణతో పాటు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాలు చేపట్టడం వంటి బృహత్తరమైన ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు వెళుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఓఆర్ఆర్ లోపలి కోర్ అర్బన్ ప్రాంత పరిపాలన మొత్తం ఒక గొడుగు కిందకు తెచ్చి నగర అభివృద్ధికి స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను రూపొందించినట్లు ఆయన వెల్లడించారు. శాసనమండలి సభ్యులు లేవనెత్తిన ఒక ప్రశ్నకు సమాధానంగా ముఖ్యమంత్రి మెట్రో రోడ్ల విస్తరణపై సమగ్రంగా వివరించారు. చివరి ప్రాంతం వరకు రవాణా సౌకర్యం కల్పించే లక్ష్యంతో రూ. 24 వేల కోట్లతో మెట్రో రెండో దశను 76 కిలోమీటర్ల మేర విస్తరించడానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని పేర్కొన్నారు.

### మెట్రో రెండో దశ విస్తరణ

హైదరాబాద్ మెట్రో ప్రారంభమైనప్పుడు దేశంలోనే రెండో స్థానంలో ఉండగా గత దశాబ్దకాలం ఎలాంటి విస్తరణ కార్యక్రమాలు చేపట్టకపోవడంతో తొమ్మిదో స్థానంలోకి పడిపోయామని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. నగరానికి ఎక్కడి నుంచి అయితే ట్రాఫిక్ ప్రారంభమవుతుందో అటువంటి హయత్‌నగర్ రామచంద్రాపురం లాంటి ప్రాంతాలకు మెట్రోను విస్తరించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఎల్బీనగర్ వద్ద ఆగిపోయిన మెట్రోను హయత్‌నగర్ వరకు పొడిగించడంతో పాటు అంతర్జాతీయ విమానాశ్రయానికి నాగోల్ ఓవైసీ ఆసుపత్రి చాంద్రాయగుట్ట రాజేంద్రనగర్ మీదుగా శంషాబాద్ వరకు మెట్రో కనెక్టివిటీ కల్పిస్తున్నామని వివరించారు. ఐటీ ఉద్యోగులు ఎక్కువగా ఉండే ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నియోపోలిస్ వరకు కూడా మెట్రోను విస్తరించడం ద్వారా రవాణా వ్యవస్థను బలోపేతం చేయనున్నారు.


### ఎలివేటెడ్ కారిడార్లు - అండర్ టన్నెల్

ట్రాఫిక్ నియంత్రణ కోసం రోడ్లను మూడు రకాలుగా విభజించి అండర్ పాస్ సర్ఫేస్ రోడ్లు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. ఉత్తర తెలంగాణ మార్గంలో బాటిల్ నెక్‌గా మారిన కంటోన్మెంట్ ప్రాంతంలో ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం కోసం రక్షణ శాఖ నుంచి 153 ఎకరాల భూమిని సేకరించినట్లు చెప్పారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా బేగంపేట విమానాశ్రయ రన్‌వే కింద నుంచి అండర్ టన్నెల్ నిర్మాణానికి అనుమతి తీసుకుని పనులు మొదలుపెట్టామని వెల్లడించారు. నల్గొండ వైపు వెళ్లే వారికి ఇబ్బందిగా మారిన జంక్షన్ వద్ద ఎలివేటెడ్ కారిడార్ జూన్ లేదా జూలై నాటికి అందుబాటులోకి వస్తుందని ఆయన సభకు వివరించారు.

### పాదచారుల భద్రత - మూసీ ప్రక్షాళన

నగరంలో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించడానికి ఆపరేషన్ రోప్ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని ముఖ్యమంత్రి చెప్పారు. పార్కింగ్ సమస్యల పరిష్కారం కోసం కేబీఆర్ పార్క్ నాంపల్లి వంటి ప్రాంతాల్లో మల్టీలెవల్ కార్ పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మూసీ పునరుజ్జీవనంలో భాగంగా హిమాయత్ సాగర్ జంక్షన్ నుంచి మూసీ వెంట గౌరవెల్లి వరకు సుమారు 43 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఈ కారిడార్ నిర్మాణం వల్ల నగరంలోని ప్రధాన జంక్షన్ల వద్ద ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పరిపాలనా సౌలభ్యం కోసం హైదరాబాద్ సైబరాబాద్ మేడ్చెల్ కార్పొరేషన్లతో పాటు నాలుగు పోలీస్ కమిషనరేట్లను ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు.

## మృతుల కుటుంబాలకు 'కోటి' భరోసా



విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యుత్ ఉద్యోగులు ఓర్సు సురేష్, ముఖ్తార్ బేగ్ కుటుంబాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోటి రూపాయల చొప్పున బీమా చెక్కులు అందజేశారు. అసెంబ్లీలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని పది లక్షల రూపాయలకు పెంచుతూ ఉద్యోగ కుటుంబాల్లో ధైర్యం నింపారు.

# రైతుభరోసా విడుదల

## సీఎంకు కృతజ్ఞతల వెల్లువ

**హైదరాబాద్, మార్చి 23 :** తొలి విడత రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాష్ట్ర శాసనసభ, శాసనమండలి విప్‌లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ధన్యవాదాలు తెలిపారు. శాసనసభలోని సీఎం కార్యాలయంలో వీరు ముఖ్యమంత్రిని కలిసి రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. సకాలంలో రైతులకు సాయం అందజేయడం వల్ల వారికి ఊరట దక్కిందని అన్నారు. కాంగ్రెస్ రైతుల పక్షపాతి అని నిరూపితం అయ్యిందని పేర్కొన్నారు.

# మీ అప్పుల వడ్డీలకే సరిపోతోంది

## రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన ఘనత మీదే

## రుణమాఫీ పేరుతో రైతులను వంచించారు

## అసెంబ్లీలో బీఆర్ఎస్ తీరుపై నిప్పులు చెరిగిన మంత్రి సీతక్క



**హైదరాబాద్, మార్చి 23:** అసెంబ్లీలో బడ్జెట్ చర్చలు వాడివేడిగా సాగాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు చేసిన విమర్శలపై మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని, ఇప్పుడు ఆ అప్పులకు వడ్డీలు కట్టడానికే ప్రభుత్వ ఖజానా సరిపోతోందని ఆమె ధ్వజమెత్తారు.

### అప్పుల కుప్పగా తెలంగాణ

పాండవులు సంపాదించింది కౌరవుల తద్దినానికే సరిపోయినట్లు.. మీరు చేసిన అప్పులకు వడ్డీలు కట్టడమే మాకు సరిపోతోందంటూ ఆమె ఎద్దేవా చేశారు. హరీష్ రావు తన నియోజకవర్గంలోనే రైతులకు అప్పులు ఉన్నాయని చెబుతున్నారని, మరి ఫైనాన్స్ మినిస్టర్‌గా ఉండి కూడా పదేళ్లలో ఎందుకు రుణమాఫీ చేయలేకపోయారని ప్రశ్నించారు. ఏకకాలంలో లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామని చెప్పి గత ప్రభుత్వం రైతులను వంచించిందని, ఇప్పుడు ఆరు నెలల తమ పాలనపై విమర్శలు చేయడం హాస్యాస్పదమని మండిపడ్డారు.

### నియామకాలు.. సంక్షేమ పథకాలు

తెలంగాణ ఉద్యమమే నిధులు నియామకాల కోసం జరిగిందని గుర్తు చేసిన సీతక్క, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఎంతమంది నిరుద్యోగులకు ఉద్యోగ గ్యారెంటీ ఇచ్చిందని నిలదీశారు. తాము అధికారంలోకి రాగానే వేల సంఖ్యలో నియామక పత్రాలు అందజేసి పేద కుటుంబాల్లో వెలుగులు నింపామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్నబియ్యం పంపిణీ ఇందిరమ్మ ఇళ్లు నూతనంగా ప్రకటించిన 'ఇందిరమ్మ జీవిత బీమా' పథకాలను చూసి బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు.

### అధికారం కోసమే ఆరాటం

మీరు పదేళ్లలో ఎన్ని ఇళ్లు ఇచ్చారో లెక్క చెప్పండి.. మేము ఈ రెండేళ్లలో ఎన్ని ఇస్తామో చూపిస్తాం అని ఆమె సవాలు విసిరారు. హరీష్ రావు పడుతున్న బాధ అంతా అధికారం పోయిందనే తప్ప ప్రజల మీద ప్రేమతో కాదని వ్యాఖ్యానించారు. సీటు మారగానే చరిత్ర మారిపోదని, పదేళ్లు అధికారంలో ఉండి ప్రజలకు చేయని పనుల గురించి ఇప్పుడు మాట్లాడటం సరికాదని హితవు పలికారు. ప్రజల కోసం తాము చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవద్దని ఆమె సూచించారు.

# కీలక బిల్లులకు కేబినెట్ పచ్చజెండా!

## గిగ్ వర్కర్ల భద్రతకు ప్రత్యేక చట్టం

## అడ్వకేట్ల రక్షణ బిల్లుకు ఆమోదం

## మెట్రో స్వాధీన ప్రక్రియ వేగవంతం

## రోహిత్ వేముల చట్టంపై సబ్ కమిటీ ఏర్పాటు

**హైదరాబాద్, మార్చి 23:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన అసెంబ్లీ కమిటీ హాల్‌లో సోమవారం సాయంత్రం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో మొత్తం 10 ప్రధాన అంశాలపై చర్చ జరగగా.. ముఖ్యంగా గిగ్ వర్కర్ల సంక్షేమం, న్యాయవాదుల రక్షణ, మెట్రో స్వాధీనం వంటి విషయాలపై కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలో సుమారు 3 నుంచి 4 లక్షల మంది గిగ్ వర్కర్లకు ప్రయోజనం చేకూరేలా 'తెలంగాణ ప్లాట్‌ఫామ్ ఆధారిత గిగ్ వర్కర్ల బిల్లు'ను ప్రభుత్వం రూపొందించింది. వీరికి సామాజిక భద్రతతో పాటు సంక్షేమ పథకాలు అందించేలా ఈ బిల్లులో ప్రతిపాదనలు ఉన్నాయి. దీనితో పాటు విద్వేషపూరిత ప్రసంగాలు, నేరాల నిరోధక బిల్లుకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కోర్ అర్బన్ యాక్ట్ డ్రాఫ్ట్ బిల్లుపై కూడా సుదీర్ఘంగా చర్చించారు.

### న్యాయవాదుల రక్షణ.. మెట్రో స్వాధీనం

న్యాయవాదుల భద్రత కోసం 'తెలంగాణ అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లు'ను కేబినెట్ ఆమోదించింది. మరోవైపు ఎల్ అండ్ టీ నుంచి మెట్రో స్వాధీన ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన లావాదేవీల నిర్వహణ బాధ్యతను హెచ్ ఎం ఆర్ ఎల్ కు అప్పగించింది.

### కులగణన.. రోహిత్ వేముల చట్టం

కులగణనపై జస్టిస్ సుదర్శన్‌రెడ్డి కమిటీ ఇచ్చిన నివేదికకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నివేదికను పరిశీలించే బాధ్యతను కేబినెట్ సబ్ కమిటీకి అప్పగించింది. అలాగే రోహిత్ వేముల చట్టం విధివిధానాల రూపకల్పన కోసం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఛైర్మన్‌గా మంత్రులు దామోదర రాజనరసింహ, శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా సబ్ కమిటీని నియమిస్తూ తీర్మానం చేసింది.

# క్యూనెట్ ఘరానా మోసం

- 32 మంది కేటుగాళ్ల అరెస్ట్
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే టార్గెట్
- బాధితుడి ఆత్మహత్యతో వెలుగులోకి..
- సీపీ సజ్జనార్ వెల్లడి!



**హైదరాబాద్, మార్చి 23 :** క్యూనెట్ సంస్థ మల్టీలెవల్ మార్కెటింగ్ పేరిట ఘరానా మోసం చేస్తోందని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీపీ వీసీ సజ్జనార్ వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా మోసాలు చేస్తున్న క్యూనెట్ సంస్థపై దాడులు చేసి 32 మంది నిందితులను సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారని పేర్కొన్నారు. సోమవారం క్యూనెట్ కేసుకు సంబంధించి బషీర్‌బాగ్ సీసీఎస్‌లో సజ్జనార్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించారు. 1998 నుంచి క్యూనెట్ నిర్వాహకులు వివిధ రకాల పేర్లతో మోసాలకు పాల్పడుతున్నారని సీపీ సజ్జనార్ తెలిపారు.

### క్యూనెట్ సంస్థ నిర్వాహకుల పన్నాగాం

ప్రొడక్ట్ ముందు చూపెడుతూ వెనకాల మోసం చేసి డబ్బులు దండుకోవడమే క్యూనెట్ సంస్థ నిర్వాహకుల టార్గెట్ అని చెప్పుకొచ్చారు. హైదరాబాద్ నగరంలో 22 మంది బాధితులు తెలిపిన వివరాల మేరకు కేసులు నమోదు చేశామని అన్నారు. క్యూనెట్ కీలక ఆధారాల కోసం 30 టీమ్‌లతో ఈ కేసును ఛేదించామని తెలిపారు. సిద్దిపేటలో హరికృష్ణ అనే బాధితుడు రూ. 5 లక్షలు మోసపోయారని అన్నారు. హరికృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్యూనెట్ సంస్థ కార్యకలాపాలపై దృష్టిసారించామని చెప్పుకొచ్చారు. క్యూనెట్ సంస్థ చెప్పేది ఒక్కటని, చేసేది ఇంకొకటంటూ బాధితుడు సూసైడ్ నోట్ రాసి చనిపోయారని అన్నారు.

### సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు గాలం

వెల్‌నెస్ ప్రొడక్ట్స్, బిస్కెట్స్, హెల్త్‌ఫుడ్స్ తయారీ పేరిట ప్రజల్లోకి వెళ్తూ ట్రాప్‌లోకి దించుతున్నారని సీపీ సజ్జనార్ తెలిపారు. క్యూనెట్ సంస్థలో చేరే వ్యక్తులకు ముందు ఇష్టపూర్వకంగా చేరుతున్నామని బాండ్ పేపర్లపై రాయించుకున్న తర్వాతే ఈ సంస్థలోకి తీసుకుంటారని తెలిపారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను టార్గెట్ చేస్తూ వాళ్లకు ప్రొడక్ట్ చూపెట్టి సైడ్ ఇన్‌కమ్ పేరుతో ట్రాప్ చేస్తున్నారన్నారు. ఉద్యోగస్థులు పెట్టుబడి పెట్టడానికి డబ్బులు లేకపోతే వాళ్లే ప్రైవేట్ ఫైనాన్స్ ద్వారా ఇప్పించి అధికంగా డబ్బులు వసూలు చేశారని తెలిపారు.

### 32 మంది నిందితుల అరెస్ట్

నెలరోజులుగా క్యూనెట్ సంస్థపై దర్యాప్తు చేసి పూర్తి స్థాయిలో ఆధారాలను సేకరించి అరెస్ట్ చేశామని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోందని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు 32 మంది నిందితులను అరెస్ట్ చేశామని.. 32 మందిలో 11 మంది మహిళలు ఉన్నారని ప్రస్తావించారు. చాలామంది ఇండియన్ డైరెక్ట్ సెల్లర్స్‌గా ఏర్పడి బిజినెస్ చేస్తున్నారని అన్నారు. డైరెక్ట్ ప్రొడక్ట్ సెల్లింగ్ పేరుతో మనీ స్కాంలకు పాల్పడుతున్నారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

# అసెంబ్లీలో 'బియ్యం' పోరు..

## హరీష్ వర్సెస్ ఉత్తమ్!

- ఎగుమతుల్లో కుంభకోణం జరిగిందన్న హరీష్ రావు
- హౌస్ కమిటీ వేయాలని బీఆర్ఎస్ పట్టు
- అవన్నీ అసత్యాలేనని మండిపడ్డ మంత్రి ఉత్తమ్
- సభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మాటల యుద్ధం



**హైదరాబాద్, మార్చి 23 :** తెలంగాణ శాసనసభ వేదికగా సోమవారం బియ్యం ఎగుమతుల వ్యవహారం సెగలు పుట్టించింది. ఫిలిప్పీన్స్‌కు బియ్యం పంపే ప్రక్రియలో భారీ కుంభకోణం జరిగిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించగా.. అవన్నీ నిరాధారమైన వ్యాఖ్యలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కొట్టిపారేశారు. ఈ క్రమంలో ఇద్దరు నేతల మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం సాగడంతో సభలో ఒక్కసారిగా ఉత్కంఠ నెలకొంది.

### కుంభకోణంపై విచారణ జరపాలి: హరీష్ రావు

ప్రశ్నోత్తరాల సమయంలో హరీష్ రావు మాట్లాడుతూ.. ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి చేయడంలో ప్రభుత్వం నిబంధనలు తుంగలో తొక్కిందని మండిపడ్డారు. సీబీఐ, ఈడీ కేసులున్న ప్రేమ్‌చంద్ గార్గ్‌ను సలహాదారుగా ఎలా నియమించుకున్నారని నిలదీశారు. నాఫెడ్‌కు అవకాశం ఇవ్వకుండా నామినేషన్ పద్ధతిలో ప్రైవేటు సంస్థకు ఎందుకు కట్టబెట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాకినాడ పోర్టులో ఏడాది కాలంగా 7,500 టన్నుల బియ్యం ముక్కిపోతున్నాయని, దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారంపై హౌస్ కమిటీ వేసి విచారణ జరపాలని, అందులో తనను కూడా సభ్యుడిగా ఉంచాలని హరీష్ రావు గట్టిగా కోరారు.

### తప్పుడు ప్రచారం ఆపండి: మంత్రి ఉత్తమ్



హరీష్ రావు ఆరోపణలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. విదేశాలకు బియ్యం ఎగుమతి చేసే విషయంలో నేరుగా ఫిలిప్పీన్స్ మంత్రితోనే ఒప్పందం చేసుకున్నామని స్పష్టం చేశారు. షిప్పింగ్ తో పాటు గోదాం ఛార్జీలన్నీ ఆ దేశమే భరిస్తోందని వివరించారు. ఏమీ తెలియకుండా స్కాం అంటూ అసత్య ప్రచారం చేయడం తగదని బీఆర్ఎస్ సభ్యులపై మండిపడ్డారు. గత ప్రభుత్వం కంటే మెరుగ్గా రైతులకు మేలు చేస్తున్నామని, పండించిన ప్రతి గింజను కొంటున్నామని వెల్లడించారు. ప్రతిపక్షం సిఫారసు చేసిన వ్యక్తులకు బియ్యం ఇవ్వలేదనే అక్కసుతోనే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారా అని హరీష్ రావును ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్ణయాల వల్ల రైతులకు మేలు జరుగుతుంటే ఓర్వలేక పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సకాలంలో జీతాలు

## బకాయిల చెల్లింపునకు పక్కా ప్లాన్!

## ఒకటో తేదీనే వేతనాలు.. మూడు డీఏలు కూడా చెల్లిస్తాం

## బకాయిల భారం తప్పించుకునేందుకే గతంలో రిటైర్మెంట్ వయసు పెంపు

## ప్రతి నెలా వెయ్యి కోట్లు చెల్లించేలా ప్రభుత్వ యోచన: భట్టి విక్రమార్క



**హైదరాబాద్, మార్చి 23:** ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 15వ తేదీ తర్వాతే వేతనాలు అందేవని.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మొదటి తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని చెప్పారు. గత పాలకులు పెండింగ్‌లో పెట్టిన మూడు డీఏలను కూడా చెల్లిస్తామని అసెంబ్లీలో స్పష్టం చేశారు.

### పదవీ విరమణ వయసు పెంపు వెనుక అసలు గుట్టు

రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల భారం తప్పించుకునేందుకే గత ప్రభుత్వం పదవీ విరమణ వయసును మూడు ఏళ్లు పెంచిందని విమర్శించారు. ఉద్యోగుల వయసును 58 నుండి 61 సంవత్సరాలకు.. నాలుగవ తరగతి సిబ్బందికి 60 నుండి 65 ఏళ్లకు పెంచడం వల్ల 17 వేల మంది పదవీ విరమణ ప్రయోజనాల భారం ప్రస్తుతం తమ ప్రభుత్వంపై పడిందని వివరించారు. ఇప్పటికే మెడికల్ బిల్లులన్నీ క్లియర్ చేశామని.. ఉద్యోగులకు నగదు రహిత ఆరోగ్య కార్డులు ఇస్తున్నామని తెలిపారు.

### బకాయిల చెల్లింపునకు భారీ ప్రణాళిక

గత ప్రభుత్వం మొత్తం 40,150 కోట్ల రూపాయల బకాయిలు వదిలి వెళ్లిందని.. ఇందులో ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్లులే 4,575 కోట్లు ఉన్నాయని శ్వేత పత్రం ద్వారా వెల్లడించారు. ఈ బకాయిలను తీర్చేందుకు ప్రస్తుతం ప్రతి నెలా 700 కోట్లు చెల్లిస్తున్నామని.. దీనిని వెయ్యి కోట్లకు పెంచాలని విధానపరమైన నిర్ణయం తీసుకునే ఆలోచనలో ఉన్నామని చెప్పారు. ప్రతి సమస్యనూ మానవీయ కోణంలో చూస్తామని.. ఉద్యోగుల బకాయిలన్నీ త్వరలోనే క్లియర్ చేస్తామని భరోసా ఇచ్చారు.

# కాంగ్రెస్ హామీలకు దిక్కులేదు

## అమలు కాని వాగ్దానాలు.. అవినీతి పాలన

## అప్పుల లెక్కలపై ప్రభుత్వానికి నిలదీత


## రైతు భరోసా ఎగ్గొట్టి రైతులను మోసం చేశారు

**జడ్చర్ల, మార్చి 23 :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఎక్కడా అమలు కావడం లేదని బిఆర్ఎస్ నాయకుడు మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి విమర్శించారు. మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని అంబేద్కర్ కళా భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కాంగ్రెస్ పాలనపై విరుచుకుపడ్డారు.

### మభ్యపెట్టే రాజకీయాలు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సగం రోజులు గడిచిపోయినా ఇచ్చిన హామీలు ఏమయ్యాయని లక్ష్మారెడ్డి ప్రశ్నించారు. ఇంకెన్ని రోజులు ప్రజలను మభ్యపెడతారని నిలదీశారు. కాంగ్రెస్ సర్కార్ అత్యంత అవినీతిమయమైందని మంత్రుల మధ్య వాటా పంచాయితీలే జరుగుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులకు ప్రజల సంక్షేమం అభివృద్ధిపై పట్టింపు లేదని మండిపడ్డారు. అన్ని వర్గాల ప్రజలను ఈ ప్రభుత్వం మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రం మూడున్నర లక్షల కోట్లు అప్పు చేసిందని సిఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చెబుతుంటే.. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో రెండు లక్షల ఎనభై వేల కోట్లు మాత్రమే అప్పు ఉందని కేంద్రం పార్లమెంటులో చెప్పిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లు కూడా పూర్తి కాకముందే ఇంత భారీగా అప్పు చేసి ఏం సాధించారని ప్రశ్నించారు. బిఆర్ఎస్ చేసిన అప్పులు కడుతున్నామనేవి అవాస్తవాలని విమర్శించారు. భారీగా అప్పులు చేసినా ప్రాజెక్టులు సంక్షేమం హామీల అమలు ఎక్కడా కనిపించడం లేదన్నారు.రైతు భరోసా నిధులను మూడుసార్లు ఎగ్గొట్టి అన్నదాతలను వంచించారని లక్ష్మారెడ్డి ఆరోపించారు. బడ్జెట్ లో కేవలం అంకెల గారడీతో అభివృద్ధి సాధ్యం కాదని హితవు పలికారు. పేపర్ లో అంకెలను అటు ఇటు మార్చినంత మాత్రాన క్షేత్రస్థాయిలో ఫలితాలు రావని స్పష్టం చేశారు.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్ మంగళవారం 24 మార్చి 2026



సంపాదకీయం

# మృత్యుఘంటికలు

## నిర్లక్ష్యమే టీబీకి ఊపిరి.. భారత్‌లోనే అత్యధిక కేసులు

### నేడు ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం

మానవ చరిత్రలో అత్యంత పురాతనమైన మరియు ప్రమాదకరమైన అంటు వ్యాధుల్లో క్షయ (ట్యూబర్‌క్యులోసిస్) ఒకటి. వైద్యశాస్త్రం అద్భుత ప్రగతి సాధించి, ప్రాణాంతక వ్యాధులను సైతం నియంత్రించగలుగుతున్న ఆధునిక యుగంలో కూడా 'క్షయ' మృత్యుఘంటికలు మోగిస్తూనే ఉండటం సభ్య సమాజానికి సవాలుగా మారింది. ఒకప్పుడు క్షయ సోకితే మరణం ఖాయమని భయపడేవారు. కానీ, నేడు సకాలంలో గుర్తిస్తే పూర్తిస్థాయిలో నయం చేసే అత్యాధునిక మందులు, చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. అయినా సరే, క్షేత్రస్థాయి గణాంకాలు మాత్రం భిన్నమైన, భయంకరమైన చిత్రాన్ని ఆవిష్కరిస్తున్నాయి. నేటికీ ప్రపంచవ్యాప్తంగా ప్రతి మూడు నిమిషాలకు ఇద్దరు ఈ వ్యాధితో కన్నుమూస్తున్నారంటే, లోపం చికిత్సలో ఉందా లేక మన సామాజిక అవగాహనలో ఉందా అన్నది లోతుగా విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉంది.

#### చారిత్రక నేపథ్యం - శాస్త్రీయ విజయం

1882 మార్చి 24న జర్మనీకి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ రాబర్ట్ కోచ్ క్షయ వ్యాధికి కారణమైన 'మైకోబ్యాక్టీరియమ్ టూబరిక్లోసిస్' అనే సూక్ష్మక్రిమిని కనుగొన్నారు. ఈ ఆవిష్కరణ వైద్య ప్రపంచంలో ఒక మైలురాయి. ఈ అద్భుత ఘట్టానికి వంద ఏళ్లు పూర్తయిన సందర్భంగా, 1982లో అంతర్జాతీయ క్షయ, ఊపిరితిత్తుల వ్యాధుల వ్యతిరేక యూనియన్ చేసిన ప్రతిపాదన మేరకు ప్రతి ఏటా మార్చి 24ను 'ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం'గా పాటిస్తున్నాం. టీబీ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచడం, దాని నిర్మూలనకు ప్రపంచవ్యాప్తంగా కృషి చేయడమే ఈ దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. అయినప్పటికీ, డబ్ల్యూహెచ్‌ఓ (ఔనూ) గణాంకాల ప్రకారం ప్రపంచంలోని మొత్తం కొత్త టీబీ కేసుల్లో మూడింట రెండు వంతులు కేవలం ఎనిమిది దేశాల్లోనే ఉన్నాయి, ఇందులో దురదృష్టవశాత్తు భారత్ అగ్రస్థానంలో కొనసాగుతోంది.

#### నిర్లక్ష్యం: వ్యాధి కంటే ప్రమాదకరం

క్షయ అనేది కేవలం ఊపిరితిత్తులకే పరిమితమైన వ్యాధి కాదు. ఇది ప్రధానంగా శ్వాసకోశాన్ని దెబ్బతీసినప్పటికీ, చర్మం నుండి మెదడు వరకు, మూత్రపిండాలు మరియు వెన్నెముక వంటి శరీరంలోని ఏ భాగానికైనా సోకే అవకాశం ఉంది. రెండు వారాల కంటే ఎక్కువ కాలం ఎడతెరిపి లేని దగ్గు, సాయంత్రం వేళల్లో జ్వరం రావడం, రాత్రిపూట చెమటలు పట్టడం, ఆకలి మందగించడం మరియు అకస్మాత్తుగా బరువు తగ్గడం వంటివి దీని ప్రధాన లక్షణాలు. కొంతమందిలో కఫంలో రక్తం పడటం, ఛాతి నొప్పి వంటి తీవ్రమైన సమస్యలు కనిపిస్తాయి. వ్యాధిగ్రస్తులు దగ్గినప్పుడు లేదా తుమ్మినప్పుడు గాలిలోకి విడుదలయ్యే సూక్ష్మ బిందువుల ద్వారా ఇది ఒకరి నుండి మరొకరికి సులభంగా వ్యాపిస్తుంది. ముఖ్యంగా పోషకాహార లోపం ఉన్నవారు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు మరియు సిలికోసిస్ వంటి వృత్తిపరమైన అనారోగ్యాలతో బాధపడేవారికి ఈ వ్యాధి త్వరగా సోకుతుంది.

వైద్యులు, సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రధాన అంశం 'రోగుల నిర్లక్ష్యం'. సాధారణంగా 6 నుండి 9 నెలల పాటు క్రమం తప్పకుండా మందులు వాడితే టీబీని 100 శాతం నయం చేయవచ్చు. కానీ, చాలామంది రోగులు రెండు మూడు నెలలు మందులు వాడగానే శరీరం పుంజుకోవడంతో వ్యాధి తగ్గిందని భావించి చికిత్సను మధ్యలోనే నిలిపివేస్తున్నారు. ఇది అత్యంత హానికరం. దీనివల్ల శరీరంలోని బాక్టీరియా మందులకు లొంగని 'మల్టీ డ్రగ్ రెసిస్టెంట్' (వీణ=-ుదీ) గా మారుతుంది. ఈ స్థితికి చేరుకున్న రోగికి చికిత్స చేయడం అత్యంత క్లిష్టతరం కావడమే కాకుండా ప్రాణాపాయం కూడా ఎక్కువే. 2016లో సుమారు 10 లక్షల మంది చిన్నారులకు టీబీ సోకడం, అందులో 2.5 లక్షల మంది ప్రాణాలు కోల్పోవడం వెనుక ఇటువంటి అసంపూర్ణ చికిత్సలే ప్రధాన కారణమని తెలుస్తోంది.

#### సామాజిక బాధ్యత - ప్రభుత్వ చొరవ

భారత ప్రభుత్వం 1962 నుండే క్షయ నివారణకు ప్రత్యేక కార్యాచరణను ప్రారంభించింది. ప్రస్తుతం 'క్షయ ముక్త భారత్' లక్ష్యంతో ప్రభుత్వం రోగులకు ఉచిత పరీక్షలు, మందులతో పాటు 'నిక్షయ్ పోషణ్ యోజన' ద్వారా పోషకాహారం కోసం ఆర్థిక సహాయాన్ని కూడా అందిస్తోంది. అయితే, ఈ పోరాటంలో ప్రజల భాగస్వామ్యం అత్యం త కీలకం. చికిత్స సమయంలో ధూమపానం మరియు మద్యపానానికి దూరంగా ఉండటం అత్యవసరం. ఎందుకంటే టీబీ మందులు కాలేయంపై కొంత ప్రభావం చూపు తాయి, ఆ సమయంలో మద్యం సేవించడం వల్ల కాలేయం పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది.

**క్షయ అనేది కేవలం ఒక వ్యక్తికి సంబంధించిన ఆరోగ్య సమస్య కాదు, ఇది ఒక సామాజిక విపత్తు. ప్రపంచ జనాభాలో నాలుగో వంతు మందిలో ఈ బాక్టీరియా ఉందన్న నిజం మనల్ని అప్రమత్తం చేయాలి. లక్షణాలు కనిపించిన వెంటనే సిగ్గుపడకుండా, నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి చికిత్స ప్రారంభించాలి. పౌష్టికాహారం తీసుకోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మరియు రోగులకు సామాజిక మద్దతును అందించడం ద్వారానే మనం ఈ మహమ్మారిని తరిమికొట్టగలం. 2025 నాటికి టీబీ రహిత దేశంగా ఎదగాలన్న మన లక్ష్యం నెరవేరాలంటే.. అది ప్రతి ఒక్కరి బాధ్యతగా మారాలి. ఆరోగ్యమే మహాభాగ్యం అన్న సూక్తిని నిజం చేస్తూ, క్షయపై పోరాటంలో మనమంతా భాగస్వాములవుదాం.**

# పశ్చిమాసియా సంక్షోభం.. భారత్‌కు సవాళ్లు

- యుద్ధ ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్రంగా పడే అవకాశం
- గల్ఫ్‌లో భారతీయుల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు
- ఇంధన సరఫరా, నిల్వలపై కేంద్రం అప్రమత్తం
- లోక్‌సభలో ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ, మార్చి 23:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. సోమవారం లోక్‌సభలో మాట్లాడిన ఆయన, మూడు వారాలుగా కొనసాగుతున్న ఈ యుద్ధం భారత్‌కు ఎన్నో సవాళ్లు విసురుతోందని చెప్పారు. భారత్ ఇంధన అవసరాల్లో కీలక భాగం పశ్చిమాసియా నుంచే వస్తోందని గుర్తు చేసిన మోదీ, యుద్ధం ప్రభావం ప్రజల జీవనంపై కూడా పడుతోందని పేర్కొన్నారు. గల్ఫ్ దేశాల్లో కోటి మందికిపైగా భారతీయులు ఉన్నారని, వారి భద్రతకు కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి 3.75 లక్షల మంది భారతీయులను స్వదేశానికి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. 24 గంటల కంట్రోల్ రూమ్స్, హెల్ప్‌లైన్స్ ఏర్పాటు చేసి సహాయం అందిస్తున్నామని చెప్పారు. విదేశాల్లో ఉన్న విద్యార్థులు సహా అందరికీ భారత దౌత్య కార్యాలయాలు సాయం చేస్తున్నాయని వివరించారు. ఇంధన సరఫరాపై కూడా ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని మోదీ తెలిపారు. ప్రస్తుతం దేశంలో పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. హోర్ముజ్ జలసంధి ఆయిల్, గ్యాస్ సరఫరాకు కీలకమని పేర్కొన్నారు. ప్రస్తుతం 41 దేశాల నుంచి ఇంధనం దిగుమతి చేసుకుంటున్నామని, దేశంలో 53 లక్షల మెట్రిక్ టన్నుల వ్యూహాత్మక నిల్వలు ఉన్నాయని వెల్లడించారు. రైల్వేల విద్యుదీకరణ వల్ల 180 కోట్ల లీటర్ల డీజిల్ ఆదా అయ్యిందని, ఇథనాల్ వినియోగం పెంపుతో ముడి చమురు దిగుమతులు తగ్గుతున్నాయని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు డీజిల్ కొరత లేకుండా చూస్తున్నామని, పవర్ ప్లాంట్లకు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ముప్పు ఉన్నప్పటికీ భారత్‌పై దాని ప్రభావం తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మోదీ చెప్పారు. ఎలాంటి సంక్షోభాన్నైనా ఎదుర్కొనేందుకు దేశం సిద్ధంగా ఉందని ధైర్యం వ్యక్తం చేశారు. పశ్చిమాసియా సంక్షోభంపై పార్లమెంట్ మొత్తం ఒకే గళం వినిపించాలని ప్రధాని కోరారు. చర్చలు, దౌత్య మార్గాల ద్వారా శాంతియుత పరిష్కారం సాధించేందుకు భారత్ కృషి చేస్తోందని స్పష్టం చేశారు.

# మోదీ రాజీపడ్డారు

- పార్లమెంటులో చర్చకు రావడం లేదు..
- వడోదరలో రాహుల్




వడోదర: పశ్చిమాసియాలో పరిస్థితిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లోక్‌సభలో చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ప్రధాని తన ప్రసంగంలో ఎక్కడా కూడా అమెరికా పేరును ప్రస్తావించ లేదని, నూటికి నూరు శాతం ఆయన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కంట్రోల్‌లో ఉన్నారని విమర్శించారు. పార్లమెంటులో చర్చకు ప్రధాని రావడం లేదని, అందుకు ఆయన రాజీపడమే కారణమని అన్నారు. గుజరాత్‌లోని వడోదరలో సోమవారంనాడు జరిగిన 'ఆదివాసి అధికార్ సంవిధాన్ సమ్మేళన్'లో రాహుల్ పాల్గొన్నారు. 'పార్లమెంటులో 25 నిమిషాలు ప్రధానమంత్రి మాట్లాడినట్టు విన్నాను. కానీ కచ్చితంగా ఒక మాట చెప్పగలను. ఆయన అన్నివిధాలా రాజీపడినందునే పార్లమెంటులో చర్చలో పాల్గొనడం లేదు. 25 నిమిషాల పాటు చేసిన ప్రసంగంలో అమెరికాకు వ్యతిరేకంగా ఒక్క ముక్క కూడా మాట్లాడలేదు. 100 శాతం ట్రంప్ కంట్రోల్‌లో ఆయన ఉన్నారు' అని రాహుల్ ఆరోపించారు. అమెరికాతో వాణిజ్య డీల్ పేరుతో భారత వ్యవసాయ రంగానికి తెలుపులు బార్లా తెరిచారని, దీంతో దేశీయంగా రైతుల పతనం ఖాయమని అన్నారు. 'ఇక్కడ ఉన్నవారంతా చిన్న రైతులు. అమెరికాలో వేలాది ఎకరాల వ్యవసాయ భూములున్నాయి. ఇక్కడ రైతులు చేతులతో పనిచేస్తే, అక్కడ మిషన్లతో పనిచేస్తారు. అమెరికా ఉత్పత్తులు ఇండియాకు రావడం మొదలైతే మన రైతుల పని ముగిసినట్టే' అని విశ్లేషించారు. గిరిజనులకు చెందిన భూములు, నీళ్లు, అడవులను బీజేపీ లక్ష్యంగా చేసుకుంటోందని రాహుల్ ఆరోపించారు. ఆదివాసీలు అంటే ఇండియాలో నివసించే వారని, భూములు, నీళ్లు, అడవులపై నిజమైన హక్కులు వారివేనని అన్నారు. నరేంద్ర మోదీ, ఇతర బీజేపీ నేతలు ఆదివాసీ నాయకుడు బిర్సా ముండా విగ్రహం ముందు చేతులు కట్టుకుని నిలబడతారని, నిజానికి బిర్సా ముండా జరిపిన పోరాట సిద్ధాంతాలు ఏవైతే ఉన్నాయో వాటిపై దాడి చేస్తున్నారని విమర్శించారు. ఆదివాసీలను వనవాసీలుగా సంబోధిస్తూ వారి హక్కులను బీజేపీ కొల్లగొడుతోందని విమర్శించారు.

## 10 కేజీల ఎల్పీజీ సిలిండర్లపై

# కేంద్రం స్పష్టత

**ఆ వార్తలు ఊహాగానాలేనని కేంద్రం వివరణ**

**ఎల్పీజీ సరఫరాలో ఎలాంటి నిర్ణయం లేదు**

**ప్రస్తుతం 14.2 కేజీల సిలిండర్లే కొనసాగింపు**




**న్యూఢిల్లీ:** దేశంలో 10 కేజీల ఎల్పీజీ సిలిండర్లను ప్రవేశపెడతారన్న వార్తలను కేంద్ర పెట్రోలియం శాఖ ఖండించింది. గృహ వినియోగదారుల కోసం తక్కువ బరువు సిలిండర్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వచ్చిన వార్తలు పూర్తిగా అసత్యమని స్పష్టం చేసింది. కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ ఈ విషయంపై స్పందిస్తూ, అలాంటి ప్రతిపాదనలు ఏవీ పరిశీలనలో లేవని తెలిపారు. 10 కిలోల ఎల్పీజీ సిలిండర్లపై వస్తున్న వార్తలు కేవలం ఊహాగానాలేనన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఎల్పీజీ కొరత ఏర్పడుతుందన్న వార్తల మధ్య, సరఫరాలో అంతరాయం లేకుండా ఉండేందుకు చిన్న సిలిండర్లు తీసుకురానున్నారని ప్రచారం జరిగింది. అయితే ఈ ప్రచారాన్ని కేంద్రం పూర్తిగా తోసిపుచ్చింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 14.2 కేజీల ఎల్పీజీ సిలిండర్లే గృహ వినియోగదారులకు సరఫరా అవుతున్నాయని, వాటిలో ఎలాంటి మార్పులు చేయాలనే ఆలోచన లేదని కేంద్రం స్పష్టం చేసింది.

# భారీగా తగ్గిన బంగారం ధరలు

**యుద్ధ ప్రభావంతో దిగివస్తున్న రేట్లు**

**హైదరాబాద్,మార్చి 23:** అమెరికా-ఇరాన్ మధ్య దాడులు ముదురుతుండటం, వస్తువుల ధరలు పెరుగుతాయనే భయం, ప్రపంచవ్యాప్తంగా వడ్డీ రేట్లు పెరుగుతాయన్న ఆందోళనల వల్ల ప్రపంచ మార్కెట్లు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. దీంతో అంతర్జాతీయంగా బంగారం, వెండి ధరలు భారీగా పడిపోయాయి. అమెరికా-ఇరాన్ యుద్ధం తీవ్రతరం కావడం, ముడి చమురు ధరలు అధికంగా ఉండటంతో ద్రవ్యోల్బణంపై ఆందోళనలు పెరిగాయి. ఇరాన్ - ఇజ్రాయిల్ యుద్ధం మొదలైన కొత్తలో అందరూ పోటీ పడి బంగారం కొనడంతో ధరలు ఆకాశానికి అంటాయి. ఇప్పుడు అంత రేటు పెట్టి ఎవరూ కొనలేక పోతుండటంతో ధరలు మెల్లగా దిగివస్తున్నాయి. ధరలు బాగా పెరిగినప్పుడు కొన్నవారు, ఇప్పుడు ఆ లాభాన్ని నగదుగా మార్చుకోవడానికి ఉన్న బంగారాన్ని అమ్మేస్తున్నారు. దీనివల్ల మార్కెట్లో బంగారం నిల్వలు పెరిగి ధరలు తగ్గుతున్నాయి. బ్యాంకులు వడ్డీ రేట్లు పెంచే అవకాశం ఉండటంతో, ప్రజలు బంగారం మీద కంటే డిపాజిట్లు లేదా బాండ్ల మీద పెట్టుబడి పెట్టడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఇక పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వల్ల అన్ని వస్తువుల ధరలు పెరుగుతాయనే భయం మొదలైంది. ఇది కూడా వడ్డీ రేట్లు పెరగడానికి దారితీస్తోంది. సోమవారం 1 గ్రాము 24 క్యారెట్ల బంగారం ధర రూ.595 తగ్గి రూ.14,002, 22క్యారెట్ల ధర రూ. 545 తగ్గి రూ. 12,835, 18 క్యారెట్ల ధర రూ.446 తగ్గి రూ.10,502. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.5,950 తగ్గి రూ.1,40,020, 22 క్యారెట్ల బంగారం ధర రూ.5,450 తగ్గి రూ.1,28,350, 18 క్యారెట్ల బంగారం ధర రూ.4,460 తగ్గి రూ.1,05,020 వద్ద చేరింది. హైదరాబాద్,వరంగల్,నిజామాబాద్, ఖమ్మంలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.14,002, 22 క్యారెట్ల బంగారం ధర రూ.12,835, 18 క్యారెట్ల బంగారం ధర రూ.10,502కు చేరింది.



విజయవాడ, విశాఖపట్నం, అమరావతి, గుంటూరు, నెల్లూరు, కాకినాడ, తిరుపతి, కడప, అనంతపురంలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.14,002, 22 క్యారెట్ల బంగారం ధర రూ.రూ.12,835, 18 క్యారెట్ల బంగారం ధర రూ.10,502గా ఉంది. తెలుగు రాష్ట్రాల్లో కేజీ వెండి ధర రూ.15 తగ్గి రూ.230, కేజీకి రూ.2,30,000 వద్ద రూ.15,000 తగ్గింది.


# డిజిటల్ వోచర్లతో ప్రచారం

- ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈసీ నిర్ణయం
- దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియోలో పార్టీలకు ఉచిత ప్రసార సమయం
- ఐటీ ప్లాట్‌ఫామ్ ద్వారా డిజిటల్ టైమ్ వోచర్లు జారీ

**న్యూఢిల్లీ, మార్చి 23:** భారత ఎన్నికల సంఘం అసెంబ్లీ ఎన్నికల వేళ కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీలకు ఉచిత ప్రసార సమయం కేటాయించేందుకు డిజిటల్ వోచర్ల విధానాన్ని ప్రవేశపెట్టినట్లు ప్రకటించింది. ఈ ఉచిత ప్రసార అవకాశం దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియోలో మాత్రమే అందుబాటులో ఉంటుంది. త్వరలో జరగనున్న అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 39ఏ ప్రకారం గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలకు ఈ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఈసీ తెలిపింది. ఐటీ ప్లాట్‌ఫామ్ ద్వారా డిజిటల్ టైమ్ వోచర్లు జారీ చేసి ప్రసార సమయాన్ని కేటాయిస్తారు. ప్రసార సమయం అభ్యర్థుల జాబితా విడుదలైన రోజు నుంచి ప్రారంభమై పోలింగ్‌కు రెండు రోజుల ముందు వరకు కొనసాగుతుంది. రాష్ట్ర/యూటీ స్థాయిలో పారదర్శకంగా డ్రా నిర్వహించి ప్ర




సార స్లాట్‌లను నిర్ణయిస్తారు. ప్రతి పార్టీకి 45 నిమిషాల ఉచిత ప్రసార సమయం కేటాయించబడుతుంది. గత ఎన్నికల్లో పార్టీల పనితీరు ఆధారంగా అదనపు సమయం కూడా ఇవ్వవచ్చు. రాజకీయ పార్టీలు ప్రసారం చేయబోయే కంటెంట్‌ను ముందుగానే సమర్పించి సాంకేతిక ప్రమాణాలను పాటించాలి. అదనంగా, ప్రసార భారతి ఆధ్వర్యంలో ప్యానల్ చర్చలు, డిబేట్లు కూడా నిర్వహించనున్నారు. ఈ విధానం ద్వారా రాజకీయ పార్టీలు తమ విధానాలను ప్రజలకు సమర్థంగా చేరవేయగలవని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత పెరుగుతుందని ఎన్నికల సంఘం అభిప్రాయపడుతోంది. ఇటీవల ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం కేరళ, అస్సాం, పుదుచ్చేరిలో ఏప్రిల్ 9న, తమిళనాడులో ఏప్రిల్ 23న, పశ్చిమబెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో పోలింగ్ జరగనుంది. ఫలితాలు మే 4న వెల్లడవుతాయి.



# చట్టం తన పని తాను చేసుకుపోతున్నట్టేనా!?

## మెట్‌పల్లిలో పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

## ట్విస్ట్‌తో సంచలనం

**దాడుల్లో పట్టుబడ్డ ఓ ఏఎస్ఐ.. ఎండోమెంట్ రిటైర్డ్ అధికారి.. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌తో పాటు మరో ఏడుగురు?**

**సామాన్యులు పట్టుబడితే ఫొటోలు విడుదల చేసే పోలీసులు.. ముఖ్యులు పట్టుబడితే దాపరికం ఎందుకు?**

**నేర నిరూపణ అయ్యేదాకా.. వారు నేరస్తులు కాదు.. నిందితులు మాత్రమేనని.. అందుకే ముఖానికి ముసుగు వేస్తామని పోలీసుల వ్యాఖ్య**

**మరి.. అప్పట్లో 'నకిలీ విలేకరుల' పేరిట అరెస్టైన వారికి 'ముసుగు' వేయకుండానే రిమాండ్'కు..**

**ఇప్పుడు 'పేకాట'లో పట్టుబడ్డ వారి ముఖాలకు ముసుగేసుడూ లేదు.. అసలు అరెస్టే చూపడం లేదెందుకని 'హాట్ టాపిక్' పోలీసులపై 'రాజకీయ ఒత్తిళ్ల'పై మెట్‌పల్లిలో గుసగుసలు**

**నేటి సాక్షి, మెట్‌పల్లి (రాధారపు నర్సయ్య):** జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో పేకాట స్థావరంపై పోలీసులు పక్కా సమాచారంతో మెరుపు దాడి చేశారు. అయితే ఊహించని షాక్‌తో రాజకీయ-పోలీసు వర్గాల్లో కలకలం రేపింది.! ఈ దాడిలో మెట్‌పల్లి స్టేషన్ లో పనిచేసే ఓ ఏఎస్ఐ ఒకరు, ఎండోమెంట్ శాఖ రిటైర్డ్ అధికారి,మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌తో పాటు మొత్తం ఏడుగురు పట్టుబడ్డారటని ఓ రేంజ్ లో చర్చించుకుంటున్నారు. కాగా.. పోలీసులకు పట్టుబడితే సామాన్యులైతే ముఖాలకు ఖర్చీపు కట్టకుండా ఫోటోలు, ప్రెస్ నోట్లు విడుదల చేసే పోలీసులు.. ఇక్కడ మాత్రం ఫోటోలు విడుదల చేయకపోవడం గమనార్హం.అసలు అరెస్టే చూపించడం వెనుక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.నేర నిరూపణ అయ్యేదాకా తమకు పట్టబడ్డవారు 'నిందితులే'నని.. 'నేరస్తులు'గా పరిగణించకూడదని.. అందుకే, ముఖాలకు ముసుగు వేస్తామని పోలీసుల వాదన.! కానీ గతంలో 'నకిలీ విలేకరుల' కేసుల్లో.. రెండుసార్లు 'ముసుగు' లేకుండానే రిమాండ్‌కు పంపిన ఘటనలు గుర్తుచేస్తున్నాయి. అదే కోణంలో .. ఇప్పుడు పట్టుబడ్డ 'ప్రముఖుల' వ్యవహారంపై 'రాజకీయ ఒత్తిళ్ల'తో విషయం దాచిపెట్టే ప్రయత్నాలా.? 'చట్టం' అందరికీ సమానంగా అమలు కాదా.? అనే ప్రశ్నలు మెట్‌పల్లి పట్టణంలో గుసగుసలుగా మారాయి.!

### పేకాట స్థావరంపై ఆకస్మిక దాడి - ఊహించని ట్విస్ట్

ఆదివారం సాయంత్రం మెట్‌పల్లి పట్టణంలో ఓ ఇంట్లో గోప్యంగా పేకాట పెద్ద ఎత్తున ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో పోలీసులు మెరుపు దాడి చేశారు. అయితే ఈ రైడ్‌లో పోలీసులకు తీవ్ర షాక్ తగిలింది. పట్టుబడిన ఏడుగురిలో ఒక ఏఎస్ఐ (అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్), ఎండోమెంట్ శాఖలో పనిచేసి రిటైర్డ్ అయిన అధికారి, మార్కెట్ కమిటీలో వైస్ చైర్మన్ పదవిలో ఉన్న ప్రజా ప్రతినిధి ఉన్నారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. పోలీసులు జూదం స్థావరంపై దాడికి వెళితే.. తమ శాఖ అధికారే జూదంలో పాల్గొంటూ పట్టుబడటం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

### సామాన్యులు వర్సెస్ ముఖ్యులు ద్వంద్వ ప్రమాణాల ఆరోపణలు

సామాన్యులు పేకాటలో పట్టుబడితే వెంటనే వారి ఫొటోలు విడుదల చేసి, ముఖాలకు కర్చీపు కట్టుకోమనకుండా ప్రెస్ నోట్లు జారీ చేసే పోలీసులు.. ఇక్కడ మాత్రం పట్టుబడిన వారి ఫొటోలు, వివరాలు ఎందుకు విడుదల చేయలేదు? అసలు అరెస్ట్ చేసినట్లు కూడా చూపించకపోవడం ఎందుకు? అనే ప్రశ్నలు స్థానికుల్లో తీవ్ర అనుమానాలకు తావిస్తున్నాయి. పోలీసులు ఇచ్చిన వ్యాఖ్య ప్రకారం.. నేర నిరూపణ అయ్యేదాకా వారు నేరస్తులు కాదు, నిందితులు మాత్రమే.. అందుకే ముఖాలకు ముసుగు వేస్తామని చెబుతున్నారు. కానీ గతంలో 'నకిలీ విలేఖరుల' పేరిట అరెస్టైన వారికి ముసుగు వేయకుండానే రిమాండ్‌కు పంపిన ఘటనలు ఇప్పుడు గుర్తుచేస్తున్నాయి. అదే విధంగా ఇప్పుడు పేకాటలో పట్టుబడ్డ వారి ముఖాలకు ముసుగేసుడూ లేదు.. అసలు అరెస్ట్ చూపడమే లేదని స్థానికంగా 'హాట్ టాపిక్'గా మారింది.

### రాజకీయ ఒత్తిళ్లు.. విషయం దాచిపెట్టే ప్రయత్నాలా?

దాడి తర్వాత పట్టుబడిన వారిని విడిపించేందుకు 'అధికార పార్టీ' నేతల నుంచి 'రాజకీయ ఒత్తిళ్లు' వచ్చాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రముఖ వ్యక్తులను తప్పించేందుకు నియోజకవర్గ స్థాయి నాయకులు ఒత్తిడి తెచ్చారని గుసగుసలు సాగుతున్నాయి. ఏఎస్ఐపై కేసు నమోదు చేయడంలో ఆలస్యం జరిగిందని, సోమవారం సాయంత్రం వరకు తప్పించే ప్రయత్నాలు జరిగాయని సమాచారం. చివరకు పరిస్థితులు మారడంతో ఆచితూచి కేసు నమోదు చేశారని తెలుస్తోంది? ఈ ఆలస్యం, ఫోటోలు విడుదల లేకపోవడం.. చట్టం ముందు అందరూ సమానం కాదా.? అనే విమర్శలకు దారితీస్తోంది.




### ఎప్పటి నుంచో కొనసాగుతున్న స్థావరం.. పోలీసుల నిర్లక్ష్యంపై ఆరోపణలు

ఈ పేకాట స్థావరం చాలా కాలంగా గోప్యంగా నడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం పోలీసుల నిర్లక్ష్యంగా స్థానికులు విమర్శిస్తున్నారు. ఇటీవల 'పేకాట స్థావరం' ఇంటి యజమాని పెంచిన కాపలా కుక్క మృతి చెందడంతోనే ఈ వ్యవహారం బయటపడిందని ప్రచారం జరుగుతోంది. కుక్క ఉన్నప్పుడు ముందస్తు హెచ్చరికలు అందించేదని.. పలుమార్లు దాడుల నుంచి ఆ 'కుక్క వల్లే' తప్పించుకున్నారని స్థానికులు చెవులు కొరుక్కుంటున్నారు.!

### 'ఆన్ సైట్-ఎఫ్ఐఆర్' ఈ పేకాటలో పనిచేయదా?

ఈ మధ్య డిజిపి శివధర్ రెడ్డి పోలీస్ శాఖలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు.'సైబర్ క్రైమ్' పై అవగాహన.. 'గంజాయి..మత్తు పదార్థాల'పై యుద్ధం..'అరైవ్-ఆలైవ్' వంటి వినూత్న కార్యక్రమాలతో పాటు 'పోలీస్ స్టేషన్'లలో శుభ్రత వంటి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళుతున్నారు.ఇదే క్రమంలో మూడు రోజుల క్రితం మరో వినూత్న కార్యక్రమాన్ని అమల్లోకి తెచ్చారు పోలీసులు.అదే..'ఆన్ సైట్-ఎఫ్ఐఆర్' పద్ధతి.! నేరం ఎక్కడ జరిగితే..అక్కడే 'ఎఫ్ఐఆర్' నమోదు చేయడమన్నట్టు.మరి ఇదే కోణంలో 'పేకాట స్థావరం'లో పట్టుబడ్డ ప్రముఖులపై 'ఆన్ సైట్'లోనే 'ఎఫ్ఐఆర్' ఎందుకు నమోదు చేయలేదని..పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు.!

### నిష్పక్షపాత వివరాలు వెల్లడించాలి

ఈ ఘటనపై పోలీసులు అధికారికంగా స్పందించి పూర్తి వివరాలు వెల్లడించాలని, రాజకీయ ఒత్తిళ్లకు లోనవకుండా చట్ట ప్రకారం నిష్పక్షపాతంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. 'చట్టం' తన పని తాను చేసుకుపోతున్నట్టేనా? అనే ప్రశ్న మెట్‌పల్లి పట్టణంలో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఇకపై ఏం జరుగుతుందో.. ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు!

# ప్రజా సమస్యలపై పోరాటమే బీజేపీ లక్ష్యం



- ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి
- అక్రమ అరెస్టులకు భయపడేది లేదు.. 6 గ్యారంటీలను అమలు చేయాల్సిందే

**నేటి సాక్షి, తిమ్మాపూర్:** ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేసే ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనని, ప్రభుత్వ అక్రమ అరెస్టులకు తమ కార్యకర్తలు భయపడబోరని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీలను, ఇతర హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు పిలుపునిచ్చిన 'చలో అసెంబ్లీ' కార్యక్రమానికి బయలుదేరిన తిమ్మాపూర్ బీజేపీ నాయకులను సోమవారం ఉదయం ఎల్ఎండీ పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న కార్యకర్తలను అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా ప్రజల కోసం పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. అరెస్ట్ అయిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి, మాజీ ఎంపీటీసీ ఎడ్ల జోగిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు చింతం శ్రీనివాస్, గొట్టిముక్కల తిరుపతి రెడ్డి, బీజేవైఎం అధ్యక్షుడు గడ్డం అరుణ్, కిసాన్ మోర్చా నేత బుర్ర శ్రీనివాస్ గౌడ్, ఓబీసీ మోర్చా ప్రతినిధి రాజు గౌడ్ మరియు ఇతర నాయకులు జంగ సునీల్ రెడ్డి, వేల్పుల ఓదయ్య, రేగూరి సుగుణాకర్ ఉన్నారు.

# భగత్ సింగ్ ఆశయ సాధనే యువతకు మార్గదర్శకం

- సీఐటీయూ
- ప్రజ్ఞాపూర్ నుండి గజ్వేల్ వరకు భారీ ర్యాలీ.. ఘన నివాళులు



**నేటి సాక్షి, గజ్వేల్:** బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మహా విప్లవ యోధుడు భగత్ సింగ్ త్యాగం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని సీఐటీయూ (జ×ఖ) నాయకులు పేర్కొన్నారు. భగత్ సింగ్ 95వ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ప్రజ్ఞాపూర్ నుండి గజ్వేల్ పట్టణం వరకు సాగిన ఈ ర్యాలీలో కార్మికులు, యువకులు మరియు ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం నిర్వహించిన సభలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందెబోయిన ఎల్లయ్య, ఉపాధ్యక్షుడు బండ్ల సామి మాట్లాడారు. అతి చిన్న వయసులోనే దేశం కోసం ఉరికొయ్యను ముద్దాడిన భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల త్యాగాలు వెలకట్టలేనివని కొనియాడారు. వారి పోరాట పటిమ భారత స్వాతంత్ర్య ఉద్యమానికి కొత్త దిశను చూపిందని గుర్తుచేశారు. అహింసా మార్గంతో పాటు విప్లవ మార్గం కూడా దేశ విముక్తిలో కీలక పాత్ర పోషించిందని వారు వివరించారు. నేడు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలపై వారు మండిపడ్డారు. అగ్రరాజ్యాలు తమ ఆధిపత్యం కోసం చేస్తున్న యుద్ధాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కుల మతాలకు అతీతంగా దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల ఆశయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి భారతీయుడిపై ఉందన్నారు. నేటి యువత సోషలిస్టు సమాజ స్థాపన కోసం భగత్ సింగ్ చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు, యువజన సంఘాల సభ్యులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పరీక్షా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి

- కలెక్టర్ కుమార్ దీపక్



**నేటి సాక్షి, మంచిర్యాల :** పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల వసతులు కల్పించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్డులో గల శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షల కోసం 48 కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థుల కోసం తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, గాలి, వెలుతురు వచ్చేలా ఫ్యాన్లు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించామన్నారు. అత్యవసర పరిస్థితుల కోసం వైద్య సిబ్బందిని, మందులను అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసివేసేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వివరించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆయన సూచించారు.

# తగలబడుతున్న మొక్కలు.. పట్టించుకోని అధికారులు



- కోట్లాది రూపాయల నిధులు బూడిద పాలు.. గ్రామస్తుల ఆవేదన

**నేటి సాక్షి, నారాయణపేట, ఇమామ్ సాబ్:** ప్రభుత్వాలు పర్యావరణ పరిరక్షణ కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ మొక్కలు నాటుతుంటే, అధికారుల నిర్లక్ష్యం వల్ల అవి అగ్నికి ఆహుతవుతున్నాయి. నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలోని తహసీల్దార్ మరియు ఎంపీడీవో కార్యాలయాలకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన నాటిన చెట్లు సోమవారం మంటల్లో కాలిపోతుండటం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

### చూస్తూ వెళ్తున్నా స్పందన కరువు

రహదారి వెంట మంటలు వ్యాపించి పచ్చని మొక్కలు బూడిదవుతున్నా, అదే దారిలో వెళ్లే అధికారులు కనీసం పట్టించుకోకపోవడంపై ధన్వాడ గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హరితహారం వంటి పథకాలతో పచ్చదనాన్ని పెంచేందుకు కృషి చేస్తుంటే, కళ్లముందే చెట్లు కాలిపోతున్నా అధికారులు స్పందించకపోవడం ఆశ్చర్య కలిగిస్తోందని వారు మండిపడ్డారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే మంటలను ఆర్పేలా చర్యలు తీసుకోవాలని, మొక్కలను కాపాడాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# 25న ధన్వాడ సంత బజార్ వేలంపాట

### గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు

**నేటి సాక్షి, నారాయణపేట, (ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలో ఈ నెల 25వ తేదీన సంత బజార్ వేలంపాట నిర్వహించనున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వేలంపాట వివరాలను వెల్లడించారు. గత ఏడాది ధన్వాడ సంత బజార్ వేలంపాట రూ. 2,75,000కు పాడడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ఈ ఏడాది కూడా వేలంపాటలో పాల్గొనే ఆసక్తి గల ధన్వాడ గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వేలంపాటలో పాల్గొనాలనుకునే వారు ఈ నెల 24వ తేదీన పంచాయతీ కార్యదర్శిని సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# భగత్ సింగ్ ఆశయాలను కొనసాగిస్తాం

### ధీరావత్ శ్రీను నాయక్



**నేటి సాక్షి, మిర్యాలగూడ:** దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయసులోనే ప్రాణాలర్పించిన విప్లవ వీరుడు భగత్ సింగ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని సీపీఎం దామరచర్ల మండల కమిటీ సభ్యుడు ధీరావత్ శ్రీను నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం దామరచర్ల మండలంలోని మంగళ్ దుబ్బ తండా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో భగత్ సింగ్ 95వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీను నాయక్ మాట్లాడుతూ.. భగత్ సింగ్ చేసిన పోరాటాలు, ఆయన సాహసోపేతమైన త్యాగాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. బ్రిటిష్ పాలకుల గుండెల్లో నిద్రపోయిన విప్లవ కిశోరం భగత్ సింగ్ అని కొనియాడారు. అనంతరం మంగళ్ దుబ్బ తండా గ్రామ సర్పంచ్ మధుమతి మున్నా నాయక్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ధీరావత్ సైదా నాయక్, ధీరావత్ కిషన్ నాయక్, అజ్మేరా, నాగు నాయక్, శీను సైదా, బాలు, వస్రం, కృష్ణ, అశోక్, తరుణ్, నవీన్, అంజి, సాయి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# గంప వెంకన్న జన్మదిన వేడుకలు

### 300 మంది వృద్ధులకు అన్నదానం..




**నేటి సాక్షి, గన్నేరువరం, బుర్ర అంజయ్య గౌడ్:** గన్నేరువరం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గంప వెంకన్న జన్మదిన వేడుకలు సోమవారం మండల వ్యాప్తంగా అత్యంత ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ పుల్లెల లక్ష్మీ లక్ష్మణ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు టపాసులు పేల్చి, కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని గంప వెంకన్న సుమారు 300 మంది వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి తన ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా పుల్లెల లక్ష్మణ్ మాట్లాడుతూ.. గంప వెంకన్న భవిష్యత్తులో మరింత ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో బిఆర్ఎస్ నాయకులు పండ్లు, స్వీట్లు పంపిణీ చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ న్యాత స్వప్న సుధాకర్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మీసాల ప్రభాకర్, నాయకులు బోయిని అంజయ్య, కొట్టే భూమయ్య, వంగరి మల్లయ్య గౌడ్, బోయిని పోచయ్య, ఈదయ్య, బొడ్డు శ్రీనివాస్, రాపోల్ రవి, ఘర్షకుర్తి లక్ష్మణ్, సమ్మెట అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ ఎంపీ రఘునందన్ రావు జన్మదిన వేడుకలు

### హైదరాబాద్ నివాసంలో కలిసిన తొగుట మండల బీజేపీ నాయకులు



**నేటి సాక్షి, తొగుట,(వడ్డే నర్సింలు):** మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తొగుట మండల బీజేపీ నాయకులు హైదరాబాద్‌లోని ఎంపీ నివాసానికి వెళ్లి ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు బొడ్డు నర్సింలు యాదవ్, మల్లు శ్రీకాంత్ రెడ్డి, అయిలికొండ చంద్రశేఖర్లు మాట్లాడుతూ.. రఘునందన్ రావు గారు నిత్యం పేద ప్రజల అభివృద్ధి కోసం పాటుపడే నాయకుడని కొనియాడారు. ప్రజలే ప్రాణంగా పనిచేసే ఆయన, మెదక్ పార్లమెంట్ పరిధిలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి కష్టం రాకుండా చూసుకునే సమర్థవంతమైన నాయకత్వం ఆయనదని పేర్కొన్నారు. ఎంపీ గారు నిండు నూరేళ్లూ ఆరోగ్యంగా ఉండాలని, భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. మెదక్ పార్లమెంట్ అభివృద్ధికి ఆయన సేవలు ఎంతో అవసరమని, దేవుడి ఆశీస్సులతో పాటు ప్రజల మద్దతు ఎప్పుడూ ఆయనకు ఉంటుందని అన్నారు. ఎంపీ గారిని కలిసిన వారిలో ముచ్చర్ల ఆంజనేయులు, మల్లు కరుణాకర్ రెడ్డి, వసూరి రమేష్ తదితరులు ఉన్నారు.



# చార్టర్డ్ ఫ్లైట్ కావాల్సిందే..

### విరాట్ కోహ్లీపై చార్టర్డ్ ఫ్లైట్ రూమర్స్ వైరల్

### లండన్--బెంగళూరు ప్రయాణంపై తప్పుడు ప్రచారం

### కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఎమోజీలతో క్లారిటీ..

**ఢిల్లీ:** టీంఇండియా సూపర్ స్టార్ బాట్స్మెన్ "విరాట్ కోహ్లీ" గురించి ఏ విషమైన సరే.. క్షణాల్లో వైరల్ అవుతూనే ఉంటుంది. ఐపీఎల్ 2026 సీజన్ మొదలవుతున్న నేపథ్యంలో 'విరాట్ కోహ్లీ' సంబంధించి మరోసారి ఓ పెద్ద రూమర్ ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతోంది. ఐపీఎల్ 2026 సీజన్ లో లండన్--బెంగళూరు మధ్య ప్రయాణానికి చార్టర్డ్ ఫ్లైట్స్ ఆర్సీబీ యాజమాన్యానికి హుకుం జారీ చేసినట్లు కొందరు లేనిపోని వార్తలను సృష్టించారు. అయితే తాజాగా ఈ వార్తలపై కోహ్లీ స్పష్టత ఇచ్చాడు. ఆ పుకారు వార్తలను పూర్తిగా కొట్టిపారేస్తూ.. ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో రెండు నవ్వుతున్న ఎమోజీలతో చాలా హుందాగా స్పందించాడు. వైరలైన సోషల్ మీడియా పోస్టుల్లో.. ఆర్సీబీ మ్యాచ్ ల మధ్య మూడు రోజుల గ్యాప్ ఉంటే యాజమాన్యాన్నీ చార్టర్డ్ విమానం ఏర్పాటు చేయాలని కోహ్లీ కోరాడని ప్రచారం జరిగింది. ఈ వాదనలన్నీ ఆధారంలేనివని కోహ్లీ రెండు ఎమోజిలతో తేల్చేసాడు. ఈ మధ్యనే లండన్ నుంచి భారత్‌కు తిరిగివచ్చిన కోహ్లీ.. బెంగళూరులో జట్టు ట్రైనింగ్ క్యాంప్‌లో చేరాడు. ఎప్పటి లాగే మరోసారి ఐపీఎల్ లో తన మార్క్ బ్యాటింగ్ చూపించేందుకు కఠినంగా మైదానంలో శ్రమిస్తున్నాడు. మార్చి 28న ఐపీఎల్ 2026 మొదటి మ్యాచ్ గా ఆర్సీబీ సన్ రైజర్స్ హైదరాబాద్ తో తొలి మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరగనుంది. కోహ్లీ లండన్ ప్రయాణాలపై చర్చలు కొత్తవి కావు. కోహ్లీ తన కుటుంబంతో కలిసి కొంత సమయం గడపడానికి లండన్ కు వెళ్తూ.. అక్కడ సాధారణ జీవితం గడపడానికి ఇష్టపడతాడు. అయితే ఈ నిర్ణయంపై కొంతమంది విమర్శలు కూడా వ్యక్తం చేసేవారు లేకపోలేదు. దేశానికి చెందిన ప్రముఖ ఆటగాడు విదేశాల్లో ఎక్కువ సమయం గడపడం సరైనదేనా అనే పలు ప్రశ్నలు సోషల్ మీడియాలో ఎప్పుడునుండో వినిపిస్తున్నాయి.




# పీఎస్ఎల్ 2026పై ఉగ్ర నీడ

- వార్నర్, స్మిత్ బ్యాట్ పడితే బాంబులు పేలుస్తాం!
- పీఎస్ఎల్‌ను వణికిస్తున్న ఉగ్రవాదుల ప్రకటన



**ఢిల్లీ:** మరో మూడు రోజుల్లో ప్రారంభం కావాల్సిన పాకిస్థాన్ సూపర్ లీగ్ 2026 సీజన్‌ను ఉగ్రవాదుల భయం వణికిస్తోంది. పాకిస్థాన్‌లో క్రియాశీలంగా ఉన్న నిషేధిత ఉగ్రవాద సంస్థ 'తహ్రీక్-ఇ-తాలిబాన్ పాకిస్థాన్'కి చెందిన జమాత్-ఉల్-అహ్రార్ విభాగం డైరెక్ట్‌గా విదేశీ ఆటగాళ్లను లక్ష్యంగా చేసుకుంటామని బహిరంగంగా హెచ్చరించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ఒక సీనియర్ కమాండర్ పేరుతో విడుదలైన ప్రకటన ఇప్పుడు అంతర్జాతీయ క్రికెట్ వర్గాల్లో కలకలం రేపుతోంది.

### వార్నర్, స్మిత్‌లకు ప్రత్యక్ష హెచ్చరికలు..

ఈసారి పీఎస్ఎల్‌లో ఆస్ట్రేలియా దిగ్గజాలు డేవిడ్ వార్నర్ (కరాచీ కింగ్స్ కెప్టెన్), స్టీవ్ స్మిత్ (ముల్తాన్ సుల్తాన్స్) వంటి స్టార్ ప్లేయర్లు పాల్గొంటున్నారు. ఉగ్రవాద సంస్థ విడుదల చేసిన తాజా ప్రకటనలో వీరిద్దరి పేర్లను ప్రత్యేకంగా ప్రస్తావించడం క్రికెట్ వర్గాల్లో ఆందోళన కలిగిస్తోంది. "మీ ఆటగాళ్లను పాకిస్థాన్‌కు పంపకండి. మైదానంలో వారికి ఏదైనా జరిగితే మా బాధ్యత కాదు" అంటూ వివిధ క్రికెట్ బోర్డులను ఉగ్రవాదులు బహిరంగంగా హెచ్చరించారు. వార్నర్, స్మిత్‌తో పాటు మార్నస్ లబుషేన్, మోయిన్ అలీ, డెవాన్ కాన్వే, ఆడమ్ జంపా వంటి స్టార్ ప్లేయర్లు కూడా ఈ లీగ్‌లో పాల్గొంటున్నారు.

### పీసీబీ సంచలన నిర్ణయం..

పరిస్థితి తీవ్రతను గమనించిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ అత్యవసర నిర్ణయాలు తీసుకున్నారు.. భద్రతా కారణాల దృష్ట్యా పీఎస్ఎల్ 2026 మ్యాచ్‌లన్నీ ప్రేక్షకులు లేకుండానే నిర్వహించనున్నారు. మార్చి 26న జరగాల్సిన గ్రాండ్ ఓపెనింగ్ సెరిమనీని సైతం పీసీబీ రద్దు చేసింది. ముందుగా నిర్ణయించిన వేదికలను మార్చి, కేవలం లాహోర్, కరాచీ నగరాలకే ఈ మెగా టోర్నీని పరిమితం చేశారు. ఇదే సమయంలో మార్చి 26 నుంచి స్టార్ట్ కానున్న ఈ టోర్నీలో మొత్తం 44 మ్యాచ్‌లు జరగాల్సి ఉంది. అయితే, తాజా బెదిరింపుల నేపథ్యంలో విదేశీ ఆటగాళ్లు పాకిస్థాన్‌లో కొనసాగుతారా లేదా అన్నది సందిగ్ధంగా మారింది. ఇప్పటికే కొందరు ఆటగాళ్లు పీఎస్ఎల్ వదిలి ఐపీఎల్ వైపు మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం జరుగుతుంది.

# ముంబై ఇండియన్స్ కెప్టెన్సీపై మళ్లీ చర్చ

- 'ముంబై ఇండియన్స్' కెప్టెన్సీ నుండి 'హార్దిక్ పాండ్య' అవుట్..?
- కొత్త కెప్టెన్ గా సూర్యకుమార్ యాదవ్ !
- కృష్ణమాచారి శ్రీకాంత్ కీలక వ్యాఖ్యలు వైరల్



**ముంబై:** మరో 5 రోజుల్లో ఐపీఎల్ 2026 సీజన్ మొదలు కానుంది. అయితే ఇంతలో ముంబై ఇండియన్స్ జట్టులో కెప్టెన్సీ అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. టీమిండియా మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పెద్ద దుమారాన్ని రేపుతున్నాయి. ప్రస్తుత కెప్టెన్ హార్దిక్ పాండ్య తన నాయకత్వ బాధ్యతలను సూర్యకుమార్ యాదవ్ కు అప్పగించాలంటూ ఆయన సూచించారు. ముంబై ఇండియన్స్ చివరిసారిగా రోహిత్ శర్మ కెప్టెన్సీలో 2020లో టైటిల్ గెలిచింది. అంటే ముంబై ట్రోఫీ గెలిచి ఐదేళ్లు అవుతుంది. 2024లో గుజరాత్ టైటాన్స్ నుంచి ట్రేడ్ ద్వారా హార్దిక్ పాండ్యా తిరిగి ముంబై ఇండియన్స్ జట్టులోకి వచ్చి కెప్టెన్ గా బాధ్యతలు చేపట్టాడు. అయితే ఆ సీజన్ లో జట్టు పాయింట్ల పట్టికలో చివరిస్థానలలో నిలవడం పలు విమర్శలకు దారితీసింది. ఇక ఐపీఎల్ 2025 సీజ న్‌లో ప్లే ఆఫ్స్ కు చేరినా, ట్రోఫీ దక్కకపోవడంతో కెప్టెన్సీపై మళ్లీ రచ్చ మొదలైంది. ముఖ్యంగా రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ వంటి వరల్డ్‌కప్ విజేత కెప్టెన్లు జట్టులో ఉండగా హార్దిక్ పాండ్య నాయకత్వంపై ఇప్పుడు అందరూ సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ యాజమాన్యం, జట్టు మేనేజ్మెంట్, అలాగే హార్దిక్, రోహిత్, సూర్యకుమార్ కలిసి భవిష్యత్‌పై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కృష్ణమాచారి శ్రీకాంత్ తన యూట్యూబ్ ఛానల్ లో సూచించారు. ఈ పరిస్థితిని "వింత పరిస్థితి"గా ఆయన పేర్కొనడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026 టీమ్ ఇండియాకు విజయం అందించిన 'సూర్యకుమార్ యాదవ్' కెప్టెన్సీకి సరైన ఎంపిక అంటూ ఆయన అభిప్రాయపడ్డారు. అంతేకాదు హార్దిక్ పాండ్యానే స్వయంగా కెప్టెన్సీ నుంచి తప్పుకుని, సూర్యకుమార్ కు బాధ్యతలు అప్పగిస్తే సమస్య సులభంగా పరిష్కారం అవుతుందని శ్రీకాంత్ సూచించడం కొసమెరుపు. "సూర్యకుమార్ లీడ్ చేయాలి, నేను సపోర్ట్ చేస్తాను" అని హార్దిక్ చెబితే జట్టులో ఉన్న అంతర్గత సమస్యలు పూర్తిగా సర్దుకుంటాయని ఆయన అన్నారు.

# సీఎస్‌కే హిస్టరీలో మైలురాయి

- ఫస్ట్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో సురేష్ రైనా, మాథ్యూ హేడెన్ ఎంట్రీ
- ఫైవ్-టైమ్ ఐపీఎల్ ఛాంపియన్స్ సీఎస్‌కే తన మొదటి హాల్ ఆఫ్ ఫేమ్‌ను ప్రకటించింది
- ఫస్ట్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో సురేష్ రైనా, మాథ్యూ హేడెన్ ఎంట్రీ

**చెన్నై :** చెన్నై సూపర్ కింగ్స్ తన చరిత్రలో మరో మైలురాయిని సాధించింది. ఫైవ్-టైమ్ ఐపీఎల్ ఛాంపియన్స్ సీఎస్‌కే తన మొదటి హాల్ ఆఫ్ ఫేమ్‌ను ప్రకటించి, ఇందులోకి భారత ఆల్‌రౌండర్ సురేష్ రైనా, ఆస్ట్రేలియా బ్యాటింగ్ దిగ్గజం మాథ్యూ హేడెన్‌లను చేర్చింది. ఈ గౌరవం మార్చి 22, 2026న చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జరిగిన 'రోరా'26' ఫ్యాన్ ఈవెంట్‌లో ప్రకటించింది. సీఎస్‌కే ఫ్రాంచైజీ తన లెగసీని గుర్తించడానికి ఈ హాల్ ఆఫ్ ఫేమ్‌ను ప్రారంభించింది. ఇది టీమ్ చరిత్రలో అత్యంత ముఖ్యమైన, భావోద్వేగపూరితమైన క్షణం అని సీఎస్‌కే అధికారికంగా పేర్కొంది. ఈ ఈవెంట్‌లో మాజీ ప్లేయర్లు, ప్రస్తుత టీమ్ సభ్యులు, ఫ్యాన్స్‌తో కలిసి గత విజయాలను సెలబ్రేట్ చేసుకున్నారు. ఐకాన్ సురేష్ రైనా సీఎస్‌కేతో 2008 నుంచి 2021 వరకు ఆడాడు. టీమ్ ఇన్సెప్షన్ నుంచి అతను స్టార్ ప్లేయర్‌గా నిలిచాడు. నాలుగు ఐపీఎల్ టైటిల్స్ (2010, 2011, 2018, 2021)లో కీలక పాత్ర పోషించాడు. అలాగే 2010, 2014 చాంపియన్స్ లీగ్ టీ20 టైటిల్స్‌లో కూడా భాగస్వామ్యం వహించాడు. 2014 సీఎల్టీ20లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డు గెలుచుకున్నాడు (234 రన్స్). సీఎస్‌కే ఫ్యాన్స్ 'చిన్న తల'గా ప్రియంగా పిలుచుకునే రైనా, టీమ్‌కు 5528 రన్స్ సాధించాడు. ఫ్రాంచైజీ అత్యధిక రన్ స్కోరర్లలో ఒకరు.

### మాథ్యూ హేడెన్ -- ఓరెంజ్ క్యాప్ విన్నర్, ఓపెనింగ్ దిగ్గజం

54 ఏళ్ల ఆస్ట్రేలియన్ బ్యాటర్ మాథ్యూ హేడెన్ 2010 ఐపీఎల్ విన్నింగ్ టీమ్‌లో భాగస్వామ్యం వహించాడు. సీఎస్‌కే తరపున ఓపెనర్‌గా భారీ ఇన్నింగ్స్ ఆడి, మొదటి సూపర్ కింగ్స్ ఆరెంజ్ క్యాప్ విన్నర్ అయ్యాడు. అతని అగ్రెస్సివ్ బ్యాటింగ్ సీఎస్‌కే బ్యాటింగ్ లైనప్‌కు బలం చేకూర్చింది. ఈ ఇద్దరు దిగ్గజాల ఇండక్షన్ సీఎస్‌కే ఫ్యాన్స్‌కు భావోద్వేగపూరితమైన క్షణం. టీమ్ లెగసీని గౌరవించడానికి ఈ హాల్ ఆఫ్ ఫేమ్ ఒక అద్భుతమైన అడుగు అని సీఎస్‌కే అధికారులు చెబుతున్నారు.





## నటి రోజా
# రీ ఎంట్రీ

### 12 ఏళ్ల తరవాత తమిళ మూవీతో స్టార్ట్

తమిళ సినీ పరిశ్రమలో సీనియర్ నటీమణుల రీఎంట్రీ ట్రెండ్ కొనసాగుతోంది. ఇటీవల శోభన తిరిగి కోలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. ఇప్పుడు మరో ఫైర్‌బ్రాండ్ నటి, రాజకీయ నాయకురాలు ఆర్కే రోజా కూడా మళ్లీ తమిళ సినిమాల్లో బిజీ అవుతున్నారు. గత కొంతకాలంగా రాజకీయాల్లో చురుకుగా ఉన్న రోజా, ప్రస్తుతం సినిమాలపై మళ్లీ ఫోకస్ పెట్టారు. 12 ఏళ్ల విరామం తర్వాత ఆమె తమిళ ఇండస్ట్రీలోకి రీఎంట్రీ ఇస్తుండటం విశేషం. ఇప్పటికే ఆమె నటించిన లెనిన్ పాండ్యన్ షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది.ఇదే సమయంలో రోజా నటిస్తున్న మరో చిత్రం అన్బే డయానా కోలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. పారి ఎలవళగన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో రమ్య రంగనాథన్ హీరోయిన్‌గా కనిపించ నున్నారు. చెన్నైలోని పెరంబూర్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ రొమాంటిక్ లవ్ స్టోరీలో రోజా కీలక పాత్రలో, ముఖ్యంగా హీరో తల్లి పాత్రలో కనిపించబోతున్నారు. ఇటీవల ఈ సినిమా నుంచి విడుదలైన 'పెరంబూర్ గానా' సాంగ్ మంచి స్పందన అందుకుంటోంది. ముఖ్యంగా ఈ పాటలో రోజా చేసిన మాస్ స్టెప్పులు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. చాలా గ్యాప్ తర్వాత కూడా తన ఎనర్జీ తగ్గలేదని మరోసారి నిరూపించారు. ఈ పాట వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.మిలియన్ డాలర్ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తవగా, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ప్రమోషన్స్‌లో భాగంగా లిరికల్ వీడియోలు విడుదల చేస్తూ సినిమాపై అంచనాలు పెంచుతున్నారు. ఇటీవల సీనియర్ నటి రాధిక నటించిన 'తాయి కిళవి' భారీ విజయాన్ని సాధించడంతో, ఇప్పుడు రోజా రీఎంట్రీ మూవీపై కూడా కోలీవుడ్‌లో మంచి బజ్ నెలకొంది. సుదీర్ఘ విరామం తర్వాత రోజా మళ్లీ తెరపై కనిపించబోతుండటంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ రీఎంట్రీతో కోలీవుడ్‌లో రోజా మరోసారి తన సత్తా చాటుతారా అన్నది చూడాలి.




# నాపేరుతో ఎలాంటి వ్యాపారాలు లేవు

### ఎవరైనా మోసం చేయాలని చూసే ఫిర్యాదు చేయండి

### గాయని మంగ్లీ ప్రకటన విడుదల

ప్రఖ్యాత ఫోక్ సింగర్ మంగ్లీ పేరుతో మైక్రో ఫైనాన్స్ వ్యాపారం జరుగుతోందని వస్తున్న వార్తలపై ఆమె ఘాటుగా స్పందించారు. తనకు అలాంటి వ్యాపారాలతో సంబంధం లేదని స్పష్టం చేస్తూ, సోషల్ మీడియా వేదికగా ఓ అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కొందరు వ్యక్తులు మంగ్లీ పేరును ఉపయోగిస్తూ మైక్రో ఫైనాన్స్ పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారనే వార్తలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆమె స్పందిస్తూ, 'నా పేరుతో డబ్బులు సేకరిస్తున్నారని వస్తున్న వార్తలు పూర్తిగా అసత్యం. నాకు ఆ వ్యక్తులతో గానీ, వార్గి ÷నాన్స్ వ్యాపారాలతో గానీ ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. మంగ్లీ తన ప్రకటనలో , తనను మరియు తన కుటుంబ సభ్యులను చాలా మంది ప్రొఫెషనల్ ఈవెంట్స్ కోసం సంప్రదిస్తుంటారని చెప్పారు. అయితే, ఆ ఈవెంట్స్‌కు సంబంధించిన ఆహ్వానాల వరకే తమకి పరిచయం ఉంటుందని, వారి వ్యక్తిగత వ్యాపారాల గురించి తాము ఎలాంటి బాధ్యత వహించబోమని స్పష్టం చేశారు. అలాగే, తన పేరును ఉపయోగించి మోసాలకు పాల్పడటం అన్యాయమని, ఇది తన వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కరెన్సీ వీడియోలు,  ÷నాన్స్ వ్యవహారాలకు తమ కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని ఆమె మరోసారి క్లియర్ చేశారు.ఎవ్వరైనా నా పేరు చెప్పి డబ్బులు అడిగితే దయచేసి నమ్మకండి. అలాంటి మోసాలకు గురైన వారికి న్యాయం చేయాలని పోలీస్ శాఖను కోరుతున్నాను అని మంగ్లీ విజ్ఞప్తి చేశారు. ఈ ప్రకటనతో, మంగ్లీ పేరును వాడుకొని జరుగుతున్న మోసాలపై ప్రజల్లో అవగాహన పెరిగే అవకాశం ఉంది.ఇదిలా ఉంటే ఇటీవల మంగ్లీ పాన్-ఇండియా చిత్రం ఐఆ: ది డెవిల్ సినిమా కోసం ఒక పాట పాడింది. 'సర్కే చునర్ తేరి సర్కే' పాటలో డబుల్ మీనింగ్ లిరిక్స్ ఉన్నాయనే ఆరోపణలతో సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.ఈ క్రమంలో మంగ్లీ సోషల్ మీడియాలో స్పందిస్తూ? 'ప్రజల భావోద్వేగాలను గౌరవిస్తూ ఈ పాటను తొలగించాం. అనుకోకుండా జరిగిన పొరపాటుకు హృదయపూర్వక క్షమాపణలు' అని తెలిపారు.

# ధురంధర్2 కలెక్షన్ల దూకుడు

### ప్రపంచవ్యాప్తంగా రూ.750 కోట్ల కలెక్షన్లు

### తన నటజీవితాన్ని గుర్తు చేసుకున్న గౌరవ

ఆదిత్య ధర్ దర్శకత్వంలో రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటించిన స్పై థ్రిల్లర్ 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద రికార్డుల సునామీ సృష్టిస్తోంది. విడుదలైన నాలుగు రోజుల్లోనే ఈ చిత్రం చారిత్రక వసూళ్లను సాధించి, హిందీ సినీ చరిత్రలో సరికొత్త మైలురాళ్లను నెలకొల్పింది.నాలుగు రోజుల్లోనే 'ధురంధర్ 2' ప్రపంచవ్యాప్తంగా రూ.750 కోట్ల కలెక్షన్లతో దూసుకుపోతోంది. బుధవారం జరిగిన పెయిడ్ ప్రివ్యూల ద్వారానే రూ.43 కోట్లు సాధించిన ఈ సినిమా, ఆదివారం ఒక్కరోజే దేశీయంగా అత్యధికంగా రూ.115 కోట్లు వసూలు చేసి రికార్డు సృష్టించింది. హిందీ చిత్రసీమలో షారుఖ్ ఖాన్ 'పఠాన్' నెలకొల్పిన రూ. 287 కోట్ల ఓపెనింగ్ వీకెండ్ రికార్డును 'ధురంధర్ 2' సునాయాసంగా అధిగమించింది. ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా రూ.180 కోట్లు వసూళ్లతో ఈ చిత్రం ప్రభంజనం సృష్టిస్తోంది. ఇకపోతే 'ధురంధర్ 2' సంచలనం సృష్టిస్తోన్న వేళ.. ఇందులో కీలకపాత్రలో నటించిన సీనియర్ నటుడు గౌరవ్ తన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ చిత్రంలో మహమ్మద్ ఆలం పాత్రతో మెప్పించిన ఆయన తాజాగా ఓ లేఖను పంచుకున్నారు. 1998లో తాను ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లలో తన తల్లిదండ్రులకు రాసిన లేఖను షేర్ చేశారు. దిల్లీ నుంచి ముంబయి వచ్చిన రోజుల్లో తన ఆర్థిక ఇబ్బందులను అందులో ప్రస్తావించారు. 'ఇది 1998లో మా అమ్మానాన్నలకు రాసిన లేఖ. నేను ముంబయికి వచ్చి అప్పటికి నెల రోజులు కూడా కాలేదు. అప్పట్లో ఈమెయిల్‌లు లేవు, కేవలం ఉత్తరాలే. ఆ తర్వాత టీవీ, సినిమాలు, యాడ్స్, రేడియో, రీల్స్.. ఇలా ఎన్నో ఒడుదొడుకులతో నా ప్రయాణం సాగింది. అప్పట్లో నా భవిష్యత్తు ఎలా ఉంటుందో తెలియదు కానీ, నేనెప్పుడూ ఆశను కోల్పోలేదు. నాకు అండగా నిలిచిన మా అమ్మానాన్నలకు ధన్యవాదాలు' అంటూ లేఖను పంచుకున్నారు. అందులో తన తల్లిదండ్రులకు అప్పటి పరిస్థితిని వివరించారు గౌరవ్. 'ప్రస్తుతానికి డబ్బు పరంగా ఏమీ కలిసిరావడం లేదు. కానీ, త్వరలోనే మంచి జరుగుతుందని ఆశిస్తున్నాను. దిల్లీతో పోలిస్తే ఇక్కడ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఖర్చు తగ్గించుకోవడానికి నేను స్నేహితుడితో కలిసి ఓ చిన్న గదిలో ఉంటున్నాను. టెలిఫోన్, విద్యుత్, గ్యాస్, నీటి బిల్లులతో పాటు భోజనం ఖర్చులు కూడా ఇద్దరం కలిసే పంచుకుంటున్నాం. భవిష్యత్తుపై ఆశతో జీవిస్తున్నాను. కానీ నేను నేర్చుకోవాల్సింది ఇంకా చాలా ఉంది' అని రాసి ఉన్న లేఖ ప్రస్తుతం వైరల్ అవుతోంది. దీనిపై బాలీవుడ్ ప్రముఖులు స్పందిస్తున్నారు. పట్టుదలతో శ్రమిస్తే ఏదో ఒకరోజు గుర్తింపు లభిస్తుందంటూ ప్రశంసిస్తున్నారు.






# బైకర్ ట్రైలర్‌కు ప్రభాస్ ప్రంశసలు

టాలీవుడ్ ఛార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రం బైకర్ ఇప్పటికే సినీ వర్గాల్లో సాలిడ్ బజ్ క్రియేట్ చేసింది. ఇండియాలోనే తొలి మోటోక్రాస్ రేసింగ్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా తన కాన్సెప్ట్‌తో ప్రత్యేక గుర్తింపును సంపాదించింది. తాజాగా విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలుస్తోంది.ఈ ట్రైలర్‌పై పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ స్పందించడం మరింత ఆసక్తిని రేకెత్తించింది. తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రభాస్ 'బైకర్ ట్రైలర్ వైబ్ అదిరిపోయింది' అంటూ ప్రశంసలు కురిపించాడు. ట్రైలర్ చాలా ఎంగేజింగ్‌గా ఉందని, సినిమా టీమ్‌కు తన శుభాకాంక్షలు తెలియజేశాడు. ముఖ్యంగా శర్వానంద్‌తో పాటు నిర్మాణ సంస్థకు కూడా విజయాన్ని కోరుకున్నాడు. ఈ ట్రైలర్‌లో హై-ఆక్టేన్ రేసింగ్ సీన్స్, ఎమోషనల్ ఎలిమెంట్స్, ఫ్యామిలీ బ్యాక్‌డ్రాప్ అన్నీ బ్యాలెన్స్‌డ్ చూపించడం విశేషం. శర్వానంద్ పూర్తిగా కొత్త లుక్‌లో కనిపిస్తూ, రేసర్ పాత్రలో తన ట్రాన్స్‌ఫర్మేషన్‌తో ఆకట్టుకుంటున్నాడు. మరోవైపు సీనియర్ నటుడు రాజశేఖర్ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనుండటం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా మాళవిక నాయర్ నటిస్తుండగా, భారీ తారాగణం ఈ ప్రాజెక్ట్‌లో భాగమైంది. దర్శకుడు అభిలాష్ రెడ్డి ఈ చిత్రాన్ని స్టైలిష్ రేసింగ్ డ్రామాగా రూపొందిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ మూవీ టెక్నికల్‌గా కూడా హై స్టాండర్డ్స్‌తో తెరకెక్కుతున్నట్లు ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది. మోటోక్రాస్ రేసింగ్ వంటి కొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ సినిమా తెలుగు ప్రేక్షకులకు ఒక ఫ్రెష్ ఎక్స్‌పీరియెన్స్ ఇవ్వనుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే ట్రైలర్‌కు వస్తున్న స్పందనను బట్టి, ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్ సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ 3న గ్రాండ్‌గా విడుదల కానున్న 'బైకర్' మూవీ, శర్వానంద్ కెరీర్‌లో ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

# మల్లన్న సాగర్ నిర్వాసితులపై సీఎం రేవంత్ రెడ్డి కపట ప్రేమ

- పెండింగ్ పరిహారం, ఇళ్ల స్థలాలపై స్పష్టత ఇవ్వాలి.. సీఐటీయూ డిమాండ్




**నేటి సాక్షి, గజ్వేల్:** మల్లన్న సాగర్ నిర్వాసితుల సమస్యల పరిష్కారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కపట ప్రేమ ప్రదర్శిస్తున్నారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి తీవ్రంగా విమర్శించారు. సిద్దిపేట జిల్లా పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు నిర్వాసితులను తీవ్ర నిరాశకు గురిచేశాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడిన ఆయన, గత ప్రభుత్వ హయాంలో అన్యాయానికి గురైన తమకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం న్యాయం చేస్తుందని ప్రజలు ఎంతో ఆశగా ఎదురుచూశారని తెలిపారు. పెద్దన్న పాత్ర పోషిస్తారనుకుంటే.. నిరాశే మిగిలింది! గతంలో నిర్వాసితుల పక్షాన నిలబడి పోరాటాలు చేసిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక పెద్దన్న పాత్ర పోషిస్తారని భావించామని, కానీ ఆయన పర్యటనలో నిర్వాసితుల సమస్యలను కనీసం ప్రస్తావించకపోవడం దారుణమని బండ్ల స్వామి మండిపడ్డారు. పెండింగ్‌లో ఉన్న పరిహారం, ఆర్ అండ్ ఆర్ (RR) ప్యాకేజీలు, ఇళ్ల స్థలాలు మరియు నిర్మాణాల వంటి కీలక అంశాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. విచారణ జరపాలి.. మౌలిక వసతులు కల్పించాలి పునరావాస కాలనీల్లో కనీస మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించాలని, ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. జిల్లా ఇన్-చార్జి మంత్రి, స్థానిక ప్రజాప్రతినిధులు నిర్వాసితుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే భవిష్యత్తులో ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

# నవోదయకు ఎంపికైన నోబెల్ హైస్కూల్ విద్యార్థులకు సన్మానం

**నేటి సాక్షి, నారాయణపేట,(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని నోబెల్ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు నవోదయ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి సీట్లు సాధించారు. విద్యార్థులు ఎస్. సుమలత (తండ్రి కథలప్ప) 90 మార్కులు, జి. నికేతన్ (తండ్రి నరేష్ కుమార్) 88.75 మార్కులు సాధించి నవోదయకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ అనిల్ కుమార్, ప్రిన్సిపాల్ నవనీత విద్యార్థులను శాలువాతో సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలలో అందించిన ప్రత్యేక కోచింగ్, విద్యార్థుల కఠోర శ్రమ వల్లే ఈ విజయం సాధ్యమైందని కొనియాడారు. తమ పిల్లలు జాతీయ స్థాయి పాఠశాలకు ఎంపికవ్వడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఘు, శ్రీజిత్, సాదొక్, పీఈటీ ఎం. అనిల్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొని విద్యార్థులకు అభినందనలు తెలిపారు.



# పరీక్షా కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



- పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు.. 163 (సెక్షన్ 144) అమలు

**నేటి సాక్షి, నారాయణపేట, (ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా జిల్లా పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. సోమవారం జిల్లా కేంద్రంలోని గ్రౌండ్ స్కూల్, గర్ల్స్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ క్షేత్రస్థాయిలో సందర్శించి, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 43 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 163 (సెక్షన్ 144) అమలులో ఉంటుందని, ఎవరూ గుంపులుగా చేరకూడదని స్పష్టం చేశారు. విద్యార్థులను లోపలికి పంపే సమయంలో క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, సెల్ ఫోన్లు లేదా ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించరాదని ఆదేశించారు. పరీక్షల్లో అక్రమాలకు తావులేకుండా కేంద్రాల సమీపంలోని (100 మీటర్ల పరిధిలో) ఉన్న జిరాక్స్ మరియు ఇంటర్నెట్ సెంటర్లను మధ్యాహ్నం 2 గంటల వరకు మూసి ఉంచాలని ఎస్పీ సూచించారు. పరిసర ప్రాంతాల్లో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేలా ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఎస్పీ వెంట టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ నరేష్ మరియు పోలీస్ సిబ్బంది ఉన్నారు.



# పేకాట స్థావరంపై పోలీసుల మెరుపు దాడి

- ముగ్గురు వ్యక్తులు అరెస్ట్.. నలుగురు పరారి
- నగదు, మొబైల్ ఫోన్లు, బైకులుస్వాధీనం

**నేటి సాక్షి,మంచిర్యాల జిల్లా:** కోటపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న నమ్మ దగిన సమాచారంతో సోమవారం కోటపల్లి పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడికి సంబంధించిన వివరాలను కోటపల్లి ఎస్సై రాజశేఖర్ వెల్లడించారు. రాంపూర్ శివారులో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ దాడిలో మొత్తం ఏడుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా, వారిలో ముగ్గురిని పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన నలుగురు వ్యక్తులు పోలీసులను చూసి అక్కడి నుండి తప్పించుకొని పారిపోయారు. పోలీసులుఅరెస్ట్ అయినా వారి వద్దనుండి స్వాధీనం, నగదు రూ. 4,050/-, మొబైల్ ఫోన్లు 04 ద్విచక్ర వాహనాలు, 03



అదుపులోకి తీసుకున్న నిందితులు: జనగాం మల్లేష్, మనుమల్ల అనిల్, గోగు నాగరాజు, పోలీసుల నుండి తప్పించుకున్న గోగు రాజేందర్, గోగు సత్తన్న, కుంతి పోషం మరియు మనుమల్ల వినోద్ లపై కేసు నమోదు చేసి తపించుకున్న వారి కోసం గాలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు, పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో అక్రమ, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచామని పేర్కొన్నారు. ఎవరైనా చట్టవిరుద్ధమైన పనులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ఆపరేషన్‌లో కోటపల్లి హెడ్ కానిస్టేబుల్ బుజ్జిబాబుతో పాటు టీజీఎస్పీ కానిస్టేబుళ్లు రాంప్రసాద్,సతీష్,సందీప్, రాజ్ కుమార్, నరేష్ పాల్గొన్నారు.

# వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు

## హర్షం వ్యక్తం చేసిన చైర్మన్ గంద్ర శ్రీనివాస్ రెడ్డి




**నేటి సాక్షి, తిమ్మాపూర్ :** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాల మరో ప్రతిష్టాత్మక మైలురాయిని అధిగమించింది. కళాశాలకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (బీదీూ) గుర్తింపు లభించినట్లు కళాశాల చైర్మన్ గంద్ర శ్రీనివాస్ రెడ్డి సోమవారం వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి ఆయన కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మీడియాతో మాట్లాడిన చైర్మన్.. గత జనవరి 9, 10, 11 తేదీల్లో ఎన్‌బీఏ నిపుణుల బృందం కళాశాలలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించిందని తెలిపారు. వారి నివేదిక ఆధారంగా బీటెక్ సీఎస్ఈ (జూజు), ఈసీఈ (జుజజు), ఈఈఈ (జుజుజు) విభాగాలకు 2026 నుండి 2028 వరకు ఈ గుర్తింపు లభించిందని వివరించారు. ఈ విజయంలో పాలుపంచుకున్న అధ్యాపక బృందానికి, సిబ్బందికి మరియు సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇదే క్రమంలో వాగేశ్వరి ఫార్మసీ కళాశాలకు 'అటానమస్' (స్వయం ప్రతిపత్తి) హోదా లభించిందని శ్రీనివాస్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఉత్తర తెలంగాణలోనే ఈ ఘనత సాధించిన ఏకైక ఫార్మసీ కళాశాలగా వాగేశ్వరి నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో జాయింట్ సెక్రటరీ డి. శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్లు విశ్వనాథ్ వినోద్, సిహెచ్. ప్రకాష్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా. శ్రీనివాస్ రెడ్డి మరియు విభాగాధిపతులు పాల్గొన్నారు.

# అత్యాచార నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్ష

## వికారాబాద్ జిల్లా కోర్టు సంచలన తీర్పు

## కారాగారంతో పాటు రూ. 12 వేల జరిమానా

## మహిళల భద్రత విషయంలో రాజీ లేదు: ఎస్పీ



**నేటి సాక్షి, వికారాబాద్:** పదేళ్ల క్రితం జరిగిన ఒక అత్యాచార కేసులో నిందితుడికి పదేళ్ల కారాగార శిక్ష విధిస్తూ వికారాబాద్ జిల్లా కోర్టు సోమవారం కీలక తీర్పు వెలువరించిందని ఎస్పీ స్నేహ మెహ్రా ఒక ప్రకటనలో వెల్లడించారు. మహిళల భద్రతకు భంగం కలిగించే వారు చట్టం నుండి తప్పించుకోలేరని ఈ తీర్పు ద్వారా మరోసారి నిరూపితమైందని ఆమె పేర్కొన్నారు. కేసు వివరాల్లోకి వెళితే.. పరిగి మండలానికి చెందిన సుక్కాని అంజయ్య (37) అనే వ్యక్తిపై 2016లో అత్యాచారం, బెదిరింపులకు (ఐపీసీ సెక్షన్లు 376, 506) సంబంధించి పరిగి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసు విచారణ వికారాబాద్‌లోని మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో కొనసాగింది. పోలీసులు సేకరించిన శాస్త్రీయ ఆధారాలు, సాక్ష్యాలను పరిశీలించిన న్యాయమూర్తి చంద్ర కిషోర్.. నిందితుడు అంజయ్యకు పదేండ్ల జైలు శిక్షతో పాటు రూ.12 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్ష పడేలా చేయడంలో విశేష కృషి చేసిన పోలీస్ అధికారులను, న్యాయ విభాగం ప్రతినిధులను ఎస్పీ స్నేహ మెహ్రా అభినందించారు. నాటి దర్యాప్తు అధికారులు వై నాగేష్ (అప్పటి పరిగి ఎస్సై), పీ ప్రసాద్ (అప్పటి పరిగి సీఐ), ప్రస్తుత పరిగి సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ హెచ్‌ఓ మోహన్ కృష్ణ పనితీరును ఆమె ప్రశంసించారు. అలాగే కోర్టులో సమర్థవంతంగా వాదనలు వినిపించిన అడిషనల్ పీపీ మెరాజ్ ఫిర్దౌస్, సీడీవో జగన్ మోహన్ రెడ్డి, కోర్టు లైజన్ ఆఫీసర్ ఎస్ నిరంజన్ గౌడ్‌ను ఎస్పీ అభినందించారు. నేరస్థులు ఎంతటి వారైనా చట్టం ముందు తలవంచాల్సిందేనని, జిల్లాలో మహిళల రక్షణ కోసం పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని ఎస్పీ ఈ సందర్భంగా హెచ్చరించారు.

# సిసి రోడ్డుకు భూమి పూజ

**నేటి సాక్షి, పాములపాడు :** పాములపాడు మండలంలోని మిట్టకందాల గ్రామంలో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయి. గ్రామంలోని రామాలయం కొట్టాల వీధిలో నూతనంగా నిర్మించ తలపెట్టిన సి.సి. రోడ్డు పనులకు తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి, మాజీ సర్పంచ్ జి.హరిప్రసాద్ యాదవ్ సోమవారం భూమి పూజ చేసి, పనులను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలోనే గ్రామాలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతాయని ధీమా వ్యక్తం చేశారు. నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్త జయసూర్యల ప్రత్యేక సహకారంతో గ్రామంలో దాదాపు రూ. 45 లక్షల వ్యయంతో 7 సి.సి. రోడ్లను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. అందరినీ కలుపుకుని గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బూత్ ఇన్‌చార్జ్ ఎల్.శివరాముడు, పార్టీ నాయకులు ఎల్.సురేష్, దేవరాజు, కె.శీను, సయ్యద్ బాషా, ఎల్.అఖిల్, కృష్ణన్న తదితరులు పాల్గొన్నారు.



# పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**పారదర్శకంగా పరీక్షలు నిర్వహించాలి**



**నేటి సాక్షి, వికారాబాద్:** వికారాబాద్ జిల్లా కేంద్రంలోని సంఘం లక్ష్మీబాయి గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. పరీక్షల నిర్వహణ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు కల్పించిన వసతులపై అధికారులను ఆరా తీశారు. చీఫ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో విద్యార్థుల హాజరు శాతం, డ్యూటీ రిజిస్టర్, మరియు ప్రశ్నపత్రాల వివరాలను కలెక్టర్ నిశితంగా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలో తాగునీటి సౌకర్యం, ఆరోగ్య కార్యకర్తల అందుబాటుపై ఆరా తీశారు. పరీక్షా విధుల్లో ఉన్న సిబ్బంది ఎవరూ సెల్ ఫోన్లతో లోపలికి రాకూడదని, నిబంధనల ప్రకారం సీసీ కెమెరాల నిఘాలోనే ప్రశ్నపత్రాల బండిల్స్ సీళ్లు తెరవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పరీక్షల్లో ఎక్కడా కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఏ చిన్న పొరపాటు జరిగినా బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్షలు ముగిసే వరకు సిబ్బంది పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని, అత్యంత పారదర్శకంగా పరీక్షలు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత విద్యాశాఖ అధికారులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# నవోదయకు కల్వకోట ప్రభుత్వ పాఠశాల విద్యార్థి

**గోడ లక్ష దీపక్‌కు ఘన సన్మానం..**



**నేటి సాక్షి, మేడిపల్లి:** మేడిపల్లి మండలంలోని కల్వకోట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (MPPS) విద్యార్థి గోడ లక్ష దీపక్ జాతీయ స్థాయి నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి సీటు సాధించాడు. ప్రభుత్వ పాఠశాల నుండి నవోదయకు ఎంపికై గ్రామానికి గర్వకారణంగా నిలిచిన లక్ష దీపక్‌ను సోమవారం పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గుగ్గిళ్ళ రమేష్ మాట్లాడుతూ.. తమ గ్రామ పాఠశాల నుండి విద్యార్థి నవోదయకు ఎంపిక కావడం చాలా సంతోషకరమని, ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయ బృందాన్ని అభినందిస్తున్నానని పేర్కొన్నారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం త్రిలోచన్ రెడ్డి మాట్లాడుతూ.. లక్ష దీపక్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కటుకం సురేందర్ మాట్లాడుతూ.. లక్ష దీపక్ సాధించిన విజయం తోటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని, ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని పట్టుదలతో చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అదే రవితేజ, ఉపాధ్యాయులు సునీల్ కుమార్, సుజాత, సుధాకర్, ఉస్మాన్, సుమలత, ఎల్ల రాజేష్, లింగంపల్లి భరత్, కటకం భూమేష్, అదే రమేష్, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ నేతల ముందస్తు అరెస్ట్



**నేటి సాక్షి, మేడిపల్లి:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ భారతీయ జనతా పార్టీ (BJP) పిలుపునిచ్చిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. ఈ నేపథ్యంలో మేడిపల్లి మండలంలోని బీజేపీ ముఖ్య నాయకులను పోలీసులు సోమవారం ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో మేడిపల్లి మండల అధ్యక్షులు చిట్యాల సురేష్, పార్లమెంట్ కో-కన్వీనర్ క్యాతం దశరథ్ రెడ్డి, భీమారం మండల అధ్యక్షులు నాగం శివకుమార్ ఉన్నారు. అలాగే బీజేపీ సీనియర్ నాయకులు ఎస్.ఎన్. రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నాడి జలపతి రెడ్డి, సీనియర్ నాయకులు కాటిపల్లి జగన్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గోస్కి మధు తదితరులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కాలరాస్తోందని, అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఈ సందర్భంగా నాయకులు మండిపడ్డారు.

# భగత్ సింగ్ ఆశయాలను కొనసాగిస్తాం



- ఎస్.ఎఫ్.ఐ - డి.వై.ఎఫ్.ఐ
- వికారాబాద్‌లో ఘనంగా భగత్ సింగ్ 95వ వర్ధంతి వేడుకలు

**నేటి సాక్షి, వికారాబాద్ ):** భారత స్వాతంత్ర్య సంగ్రామంలో యువతలో విప్లవ సెగలు రగిలించిన అజేయ యోధుడు భగత్ సింగ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని ఎస్.ఎఫ్.ఐ, డి.వై.ఎఫ్.ఐ నాయకులు ప్రతినబూనారు. సోమవారం భగత్ సింగ్ 95వ వర్ధంతిని పురస్కరించుకుని వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**ఉరితాడును ముద్దాడిన విప్లవ కిశోరం**

ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి అక్బర్, డి.వై.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి సతీష్ మాట్లాడుతూ.. 'ఇంక్విలాబ్ జిందాబాద్' అనే నినాదంతో దేశవ్యాప్తంగా యువతను స్వాతంత్ర్య కాంక్ష వైపు మళ్లించిన గొప్ప మేధావి భగత్ సింగ్ అని కొనియాడారు. కేవలం 23 ఏళ్ల చిన్న వయసులోనే రాజ్ గురు, సుఖ్‌దేవ్‌లతో కలిసి దేశం కోసం ఉరితాడును ముద్దాడిన అమరవీరుడని గుర్తుచేశారు. బ్రిటిష్ అధికారి సాండర్స్ హత్య మరియు సెంట్రల్ అసెంబ్లీపై బాంబు దాడి వంటి ఘటనలు బ్రిటిష్ సామ్రాజ్య పునాదులను కదిలించాయని వారు పేర్కొన్నారు.

**యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి**

భగత్ సింగ్ కేవలం విప్లవకారుడు మాత్రమే కాదని, గొప్ప రచయిత మరియు సోషలిస్టు భావాలు కలిగిన మేధావి అని వారు వివరించారు. నేటి యువత డ్రగ్స్, గంజాయి, మద్యం వంటి వ్యసనాలకు దూరంగా ఉండి, భగత్ సింగ్ చూపిన పోరాట మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఆయన ఆశయ సాధన కోసం విద్యార్థి, యువజన సంఘాలు నిరంతరం పోరాడుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, దీపక్, మల్లికార్జున్, రాకేష్, మహేష్, మల్లేష్, చందు, మోహన్, అనిల్, పండు తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యుల పొట్ట కొడుతున్న ఏజెన్సీలు






**నేటి సాక్షి, చౌడేపల్లి :** ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చౌడేపల్లి మండలంలో గ్యాస్ మాఫియా రెచ్చిపోతోంది. ప్రభుత్వం సామాన్యులకు సక్రమంగా గ్యాస్ అందించాలని చూస్తుంటే, ఇక్కడి డీలర్లు మాత్రం తమ స్వార్థం కోసం అక్రమాలకు తెరలేపారు. ముఖ్యంగా మండలంలోని శబరీష్ ఇండియన్ గ్యాస్ ఏజెన్సీలో అక్రమాలు పరాకాష్టకు చేరుకున్నాయని, సిలిండర్లను దారి మళ్లించి బ్లాక్ మార్కెట్‌లో రూ. 1200 నుండి రూ. 1500 వరకు విక్రయిస్తున్నారని స్థానికులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. దారి మళ్లుతున్న సిలిండర్లు.. భయభ్రాంతుల్లో వినియోగదారులు సాధారణ వినియోగదారులకు అందాల్సిన సిలిండర్లను బోయకొండ, రాయల్‌పేట వంటి ప్రాంతాల్లోని హోటళ్లకు భారీగా తరలిస్తూ అక్రమార్జన చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్యాస్ సరఫరా గురించి ప్రశ్నిస్తే ఏజెన్సీ నిర్వాహకులు వినియోగదారులపై తిరగబడుతూ, భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీ అక్రమాలకు ఒక 85 ఏళ్ల వృద్ధురాలి ఉదంతమే

- చౌడేపల్లిలో గ్యాస్ దందా
- బ్లాక్ మార్కెట్‌లో సిలిండర్ల విక్రయం.. పట్టించుకోని పౌరసరఫరాల అధికారులు

నిదర్శనం. గత 14 ఏళ్లుగా కనెక్షన్ ఉన్నా ఆమె కేవలం మూడు సిలిండర్లు మాత్రమే తీసుకున్నానని చెబుతుంటే, రికార్డుల్లో మాత్రం ఈ నెల 20న కూడా సిలిండర్ తీసుకున్నట్లు చూపిస్తున్నారు. అడిగితే ఈ-కేవైసీ (వ-ఖ్జ) లేదని సాకులు చెబుతున్న సిబ్బంది, కేవైసీ లేనప్పుడు సిలిండర్ ఎవరికి డెలివరీ చేశారనే ప్రశ్నకు సమాధానం దాటవేస్తున్నారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైన బాధితులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసరాల సరఫరాలో ఎటువంటి కొరత లేకుండా చూస్తుంటే, ఇలాంటి ఏజెన్సీల వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని ప్రజలు





వాపోతున్నారు. ఈ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ అన్నమయ్య జిల్లా నూతన కలెక్టర్ నిశాంత్ కుమార్ గారికి 'గ్రీవెన్స్'లో ఫిర్యాదు చేసేందుకు మండల ప్రజలు సిద్ధమవుతున్నారు. ఇప్పటికైనా పౌరసరఫరాల శాఖ అధికారులు నిద్ర మత్తు వీడి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని దీపం కనెక్షన్ ఉన్నవారికి, వికలాంగులకు, వృద్ధులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి





- జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ
- పెండింగ్‌లో ఉంచితే సహించేది లేదు.. అధికారులకు కలెక్టర్ గట్టి హెచ్చరిక

**నేటి సాక్షి, వికారాబాద్ :** ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను ఏమాత్రం పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల నుండి ఆయన 135 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా డీపీఓ, పంచాయతీ రాజ్, గృహ నిర్మాణం, డీఆర్‌డీఏ, ప్రణాళిక మరియు భూసేకరణ విభాగాల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వారం అందిన దరఖాస్తులు ఎన్ని? ఎన్ని పరిష్కరించారు? ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి? అనే అంశాలపై వారం రోజుల్లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమమైన '99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' అమలుపై అధికారులతో సమీక్షించారు. గ్రామ, మండల, మున్సిపాలిటీ స్థాయిల్లో రోజువారీ షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ఫోటోలతో సహా జిల్లా అధికారుల వాట్సాప్ గ్రూపుల్లో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, రెవెన్యూ అదనపు కలెక్టర్ రాజేశ్వరి, జెడ్పీ సీఈఓ సుధీర్, డీఆర్వో మంగీలాల్, ఆర్డీఓ వాసు చంద్ర, డీఆర్‌డీఓ శ్రీనివాస్ మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఎదురుపాడులో అంతర్ రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

- శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా భారీ ఏర్పాట్లు..
- విజేతలకు నగదు బహుమతులు

**నేటి సాక్షి, కొత్తపల్లి :** నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలంలోని ఎదురుపాడు గ్రామంలో శ్రీరామ నవమి పండుగ మరియు రథోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 30వ తేదీ సోమవారం అంతర్ రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు (4 పళ్ల విభాగం) నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రామ కమిటీ పెద్దలు సోమవారం పోటీల వివరాలను వెల్లడించారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు దాతల సహకారంతో ఈ క్రింది విధంగా నగదు బహుమతులు అందజేయనున్నారు:

ప్రథమ బహుమతి: రూ. 40,000/, ద్వితీయ బహుమతి: రూ. 30,000/, తృతీయ బహుమతి: రూ. 20,000/, నాల్గవ బహుమతి: రూ. 15,000/, ఐదవ బహుమతి: రూ. 10,000/, ఆరవ బహుమతి: రూ. 5,000/-, ఈ పోటీలలో పాల్గొనే వారు మార్చి 30వ తేదీ సోమవారం ఉదయం 6:30 గంటలలోపు రూ. 500 ఎంట్రీ ఫీజు చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కమిటీ సభ్యులు కోరారు. ఆసక్తి గలవారు మరిన్ని వివరాల కోసం 9885036724, 9052059489, 8142232830 నంబర్లను సంప్రదించవచ్చు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# పంచాయతీరాజ్ చట్టంపై శిక్షణ

**విధులు, నిధుల వినియోగంపై ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి దిశానిర్దేశం**



**నేటి సాక్షి, గన్నేరువరం,(బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండల కేంద్రంలోని రైతు వేదికలో నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులకు సోమవారం జనరల్ ఓరియంటేషన్ శిక్షణా కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. రెండు విడతలుగా సాగే ఈ శిక్షణలో భాగంగా మొదటి బ్యాచ్‌కు మార్చి 23 నుండి 28 వరకు, రెండో బ్యాచ్‌కు మార్చి 30 నుండి ఏప్రిల్ 4 వరకు తరగతులు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, ఆదర్శ గ్రామాల ప్రణాళిక, శానిటేషన్, ఈ–పంచాయతీ అప్లికేషన్లు, బిల్డింగ్ పర్మిషన్లు వంటి అంశాలపై సభ్యులకు అవగాహన కల్పించారు. అలాగే ఉపాధి హామీ పథకం, తాగునీటి సరఫరా మరియు నిర్వహణ, గ్రామ పంచాయతీ ఆదాయ వ్యయాల పర్యవేక్షణలో వార్డు సభ్యుల విధులను వివరించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో వార్డు సభ్యులు క్రియాశీలకంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సురేందర్, టీఓటీలు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది



మరియు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# ప్రతి పేదవాడికి 'ఇందిరమ్మ' ఇల్లు

**వెంకట్రావుపేటలో నూతన గృహ ప్రవేశాల సందడి..**

**నేటి సాక్షి, తొగుట,(వడ్డే నరసింహులు):** తొగుట మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి హాజరై, రిబ్బన్ కట్ చేసి పనులను ప్రారంభించారు. లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు ఆయన ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి గూడు కల్పించే వరకు నిరంతరం కృషి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు బండారు రమేష్ గౌడ్, ఆత్మ కమిటీ డైరెక్టర్లు ప్రవీణ్, సంతోష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాధా రాములు, చందా సత్తయ్య పాల్గొన్నారు. అలాగే మండల పార్టీ ఉపాధ్యక్షులు బెజ్జనబోయిన అనిల్, గ్రామ



పార్టీ ఉపాధ్యక్షులు అర్జున్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పంది రాజు, షఫీ, బాలకృష్ణ, స్వామి చరణ్, వార్డు సభ్యులు భాను, సీనియర్ నాయకులు భూపాల్ రెడ్డి, విజయ్ పాల్ రెడ్డి, వెంకటేశం, స్వామి, రవీందర్, భాస్కర్, అంజి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ముంగిటకే పాలన

**వార్డుల సందర్శనలో సర్పంచ్ వసంత**



**నేటి సాక్షి, సిరిసిల్ల, (శివకుమార్):** గ్రామాల్లోని క్షేత్రస్థాయి సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా సర్పంచ్ గన్నేరం వసంత వార్డు సందర్శన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సోమవారం ఆమె వార్డు సభ్యులు మరియు పంచాయతీ సిబ్బందితో కలిసి గ్రామంలోని ఒకటి మరియు రెండవ వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్శనలో భాగంగా సర్పంచ్ ఇంటింటికీ వెళ్లి ప్రజలతో నేరుగా మాట్లాడారు. డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు మరియు ఇతర స్థానిక సమస్యల గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను నమోదు చేసుకున్న సర్పంచ్, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. సాధ్యమైనంత త్వరగా వార్డుల్లోని అన్ని సమస్యలను పరిష్కరించి, గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎల్లవేణి రమేష్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, వార్డు సభ్యులు ఎద్దు విజయ, మరియ, రాణి, కరికే నవీన్, శ్రీనివాస్, లింగంపల్లి అనిల్ పాల్గొన్నారు. అలాగే ఆశా కార్యకర్తలు మల్లవ్వ, భాగ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది బాబు, యాదగిరి మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడు వేంపల్లి టింబర్ డిపోలో కలప వేలంపాట

- పారదర్శకంగా నిర్వహణ..
- పాల్గొనాలని అటవీ శాఖ అధికారుల పిలుపు

**నేటి సాక్షి, కొమరం భీమ్ ఆసిఫాబాద్ :** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండల పరిధిలోని వేంపల్లి టింబర్ డిపోలో మంగళవారం (మార్చి 24) ఉదయం 11:00 గంటలకు కలప వేలంపాట నిర్వహించనున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఈ వేలం కార్యక్రమం జిల్లా అటవీ అధికారి (ఇఖీూ) నీరజ్ కుమార్ తిబ్రీవాల్ మరియు కాగజ్‌నగర్ ఫారెస్ట్ డివిజనల్ అధికారి (FDO) ఎ. అప్పయ్య ఆధ్వర్యంలో జరుగుతుంది. అటవీ శాఖ నిబంధనల మేరకు ఈ కలప అమ్మకం పూర్తిగా పారదర్శకంగా ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. అర్హత కలిగిన కలప వ్యాపారులు మరియు వినియోగదారులు ఈ వేలంలో పాల్గొనవచ్చని సూచించారు. పాల్గొనేవారు ముందుగా నిర్ణయించిన షరతులు మరియు నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని తెలిపారు. వివరాల కోసం డిపో కార్యాలయంలో సంప్రదించాలి కలప రకాలు, పరిమాణం, వేలం విధానం మరియు రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాల కోసం ఆసక్తి గల వారు వేంపల్లి టింబర్ డిపో కార్యాలయాన్ని సంప్రదించాలని అధికారులు కోరారు. అటవీ సంపదను సుస్థిరంగా వినియోగించడమే లక్ష్యంగా ఈ వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



# పదో తరగతి పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలి



- కలెక్టర్ కె. హరిత
- పరీక్షా కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ.. వంతెన పనుల పరిశీలన

**నేటి సాక్షి, కొమరం భీమ్ ఆసిఫాబాద్ :** పదో తరగతి పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా, అత్యంత పారదర్శకంగా మరియు ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. సోమవారం కాగజ్‌నగర్ మండలం ఈజ్ గాం గ్రామంలోని శాంతినికేతన్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు అవసరమైన తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు మరియు కూర్చునే సౌకర్యాలను కలెక్టర్ స్వయంగా తనిఖీ చేశారు. ఇన్విజిలేటర్లు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని, ఎక్కడా అక్రమాలకు తావులేకుండా పర్యవేక్షణ కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం జంబుగా – పెద్దబండ రహదారి మధ్య రోడ్లు భవనాల శాఖ (=&దీ) ఆధ్వర్యంలో నిర్మించిన వంతెన పనులను కలెక్టర్ పరిశీలించారు. వంతెనకు ఇరువైపులా ఉన్న అప్రోచ్ రోడ్డు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో సంబంధిత శాఖల అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుమలాయపాలెంలో భగత్ సింగ్ 95వ వర్ధంతి



- యువతకు మార్గదర్శి భగత్ సింగ్..
- ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ మందడి ఇజ్రాయిల్

**నేటి సాక్షి, తిరుమలాయపాలెం,(మెట్టు రుద్రరాజు):** మండల కేంద్రంలో స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ 95వ వర్ధంతి వేడుకలు సోమవారం అత్యంత ఘనంగా జరిగాయి. ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ మందడి ఇజ్రాయిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం దేశభక్తి వాతావరణాన్ని తలపించింది. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మందడి ఇజ్రాయిల్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయసులోనే ప్రాణాలర్పించిన భగత్ సింగ్ త్యాగం, ధైర్యసాహసాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. సమాజంలో అన్యాయాలపై పోరాడే ధైర్యం ప్రతి ఒక్కరిలో ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం సభలో "భగత్ సింగ్ అమరుడు" అంటూ చేసిన నినాదాలు మిన్నంటాయి. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పోషించిన పాత్రను పలువురు వక్తలు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి చీమ రామకృష్ణ, సీనియర్ జర్నలిస్టు పప్పుల శ్రీనివాసరావు, తూమాటి ప్రకాష్, వెంకన్న, రామావత్ చిన్న కస్నా, తీగల మేఘనాధరావు పాల్గొన్నారు. అలాగే బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నల్లగట్టు శ్రీనివాస్, కొలిచలం కోటేశ్వరరావు, షేక్ పాషా, ఆలేటి రంగయ్య, ఆలేటి రాములు, బొడ్డు ఉపేందర్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పిండిప్రోలు పశువుల సంత వేలంపాట

**రూ. 50 వేల ధరావత్తుతో పాల్గొనాలి..**

**నేటి సాక్షి, తిరుమలాయపాలెం,( మెట్టు రుద్రరాజు):** మండల పరిధిలోని పిండిప్రోలు మేజర్ గ్రామ పంచాయతీ పశువుల సంత వేలంపాట మంగళవారం (మార్చి 24) ఉదయం 11:00 గంటలకు నిర్వహించనున్నట్లు పంచాయతీ అధికారులు తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఈ వేలం పాట కార్యక్రమం జరగనుంది. వేలం పాటలో పాల్గొనే ఆసక్తి గల వారు రిజిస్ట్రేషన్ ఫీజుతో కలిపి రూ. 50,000 ధరావత్తు (జుఖతీఅవర్ వీశీఅవఎ) సొమ్ము చెల్లించాల్సి ఉంటుంది. దీనితో పాటు సాల్వెన్సీ కింద రూ. 2,00,000 డిమాండ్ డ్రాఫ్ట్ (DD) లేదా నగదును పిండిప్రోలు గ్రామ పంచాయతీ కార్యదర్శి పేరున డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని సూచించారు. ఈ వేలం పాటను నిబంధనల ప్రకారం పారదర్శకగా నిర్వహిస్తామని, ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిండిప్రోలు గ్రామ పంచాయతీ సర్పంచ్ కామల్ల సువార్త, ఉప సర్పంచ్ చామకూరి రాజు, ఇన్చార్జి కార్యదర్శి రమేష్ మరియు పాలకవర్గ సభ్యులు కోరారు.




# భగత్ సింగ్ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడాలి



- పాఠ్యపుస్తకాల్లో భగత్ సింగ్ చరిత్ర చేర్చాలి.. సీపీఐ రాష్ట్ర నేత బట్టు దయానంద రెడ్డి

**నేటి సాక్షి, జగదేవపూర్ :** విప్లవ వీరుడు భగత్ సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకుని నేటి యువత ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బట్టు దయానంద రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం జగదేవపూర్ మండలం తీగుల్ గ్రామంలో భగత్ సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సీపీఐ గ్రామ శాఖ ఆధ్వర్యంలో జరిగిన వర్ధంతి సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా దయానంద రెడ్డి మాట్లాడుతూ.. 1907లో పంజాబ్‌లో జన్మించిన భగత్ సింగ్, చిన్నతనంలోనే విప్లవ భావజాలాన్ని అలవర్చుకున్నారని కొనియాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటం చేసి, కేవలం 23 ఏళ్ల వయసులోనే నవ్వుతూ ఉరికంబాన్ని ముద్దాడిన ధీశాలి అని గుర్తుచేశారు. ఆయన ఇచ్చిన 'ఇంక్విలాబ్ జిందాబాద్' నినాదం నేటికీ విప్లవ స్ఫూర్తిని రగిలిస్తోందని అన్నారు. భగత్ సింగ్ జీవిత చరిత్రను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని, ఆయన జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలని దయానంద రెడ్డి డిమాండ్ చేశారు. భగత్ సింగ్‌కు 'భారతరత్న' ప్రకటించాలని కోరారు. ఉచిత విద్య, వైద్యం, ఉపాధి కల్పనలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపిస్తూ, వీటి సాధన కోసం యువత ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తీగుల్ ఎంపీటీసీ మంజుల మహేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ భానుప్రకాష్ రావు, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ భూమయ్య, సీపీఐ మండల కార్యదర్శి తొందురు నర్సింహారెడ్డి, గజ్వేల్ పట్టణ కార్యదర్శి స్వర్గం రాజేశం, గ్రామ కార్యదర్శి భిక్షపతి పాల్గొన్నారు. అలాగే నాయకులు ఎల్లారెడ్డి, నరసింహారెడ్డి, లింగం, సత్తయ్య, కృష్ణమూర్తి, కరుణాకర్ రెడ్డి, రామ్ రెడ్డి, యువజన నాయకులు నితీష్ రెడ్డి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



TGTEL/25/A1737 | NETI SAKSHI

# రైతుబంధుపై వీడని గందరగోళం




- ఒకటి ఇచ్చి.. రెండు ఎగ్గొట్టేనా?
- 45 రోజుల ఆలస్యంపై రైతన్నల ఆగ్రహం.. స్పష్టత ఇవ్వకుంటే ఉద్యమమే!

**నేటి సాక్షి, మహబూబాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా రైతుబంధు చెల్లింపుల వ్యవహారం ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీస్తోంది. సాగు పెట్టుబడి కోసం ప్రభుత్వం అందించే ఈ సాయం పంపిణీలో నెలకొన్న అస్పష్టత రైతుల్లో అయోమయాన్ని నింపుతోంది. దాదాపు 45 రోజుల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ప్రభుత్వం కొంత మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసినప్పటికీ, అది ఏ పంట కాలానికి సంబంధించినదో తెలియక అన్నదాతలు తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుత పరిస్థితులు గమనిస్తుంటే, మూడు పంటల కాలానికి అందాల్సిన సాయంలో కేవలం ఒకదానికి మాత్రమే నిధులు విడుదల చేసి, మిగతా రెండు పంటల సాయాన్ని ప్రభుత్వం నిలిపివేసిందనే అనుమానాలు బలంగా వ్యక్తమవుతున్నాయి. "ఇప్పుడు ఇచ్చిందే మొత్తం సాయం" అని సరిపెట్టి, పాత బకాయిలను ఎగ్గొట్టే ప్రయత్నం జరుగుతోందా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. సమయానికి పెట్టుబడి అందక అప్పుల పాలవుతున్నామని, ఇప్పుడు ఇస్తున్న అరకొర సాయంపై కూడా స్పష్టత లేకపోవడం దారుణమని మండిపడుతున్నారు. ముఖ్యంగా వానాకాలం పంటకు సంబంధించిన రైతుబంధు మొత్తాన్ని పూర్తిగా నిలిపివేస్తున్నారనే ప్రచారం క్షేత్రస్థాయిలో కలకలం రేపుతోంది. "ఇప్పుడే చెల్లించాం" అనే సాకుతో భవిష్యత్తులో ఇవ్వాల్సిన సాయం నుంచి ప్రభుత్వం తప్పుకునే ప్రయత్నం చేస్తోందని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి. పెట్టుబడి ఖర్చులు భారమైన వేళ, ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకోకపోతే రైతాంగం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రభుత్వ ప్రకటన కోసం నిరీక్షణ.. లేదంటే పోరుబాట!

ఈ గందరగోళంపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని, ఇప్పటివరకు జమ చేసిన నిధులు ఏ సీజన్‌కు సంబంధించినవో బహిరంగ ప్రకటన చేయాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. మిగతా రెండు విడతల సాయం ఎప్పుడు విడుదల చేస్తారో క్లారిటీ ఇవ్వకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరిస్తున్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రైతుల ఆవేదనను తీర్చకపోతే పరిస్థితి మరింత తీవ్రమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

# సకాలంలో పన్నులు చెల్లించి పంచాయతీకి సహకరించాలి

- బకాయిలు లేకుండా చూడాలి..
- డిప్యూటీ ఎంపీడీవో గఫూర్ ఆదేశం



**నేటి సాక్షి, చౌడేపల్లి:** గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి ప్రజలు తమ వంతు బాధ్యతగా సకాలంలో పన్నులు చెల్లించి సహకరించాలని డిప్యూటీ ఎంపీడీవో గఫూర్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రమైన చౌడేపల్లిలో ఇంటి పన్నులు, నీటి పన్నుల వసూలు కార్యక్రమాన్ని ఆయన స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ.. పంచాయతీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పన్ను బకాయిలను ఎప్పటికప్పుడు చెల్లించాలని గ్రామస్తులకు సూచించారు. పన్నుల వసూలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఈవోపీఆర్డీలు (జూ ౖా=&=ణ), పంచాయతీ సిబ్బంది బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి పన్నుల వసూలు ప్రక్రియను పరిశీలించారు. పంచాయతీ ద్వారా అందుతున్న మౌలిక వసతులు, అభివృద్ధి పనుల కొనసాగింపునకు పన్నుల ఆదాయం కీలకమని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఓ మహేష్, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సహారా బాధితుల సొమ్మును వెంటనే చెల్లించాలి

- రేపు ఆర్‌డీఓ కార్యాలయం వద్ద నిరసన..
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముశం రమేష్




**నేటి సాక్షి, సిరిసిల్ల,(శివకుమార్):** సహారా ఇండియాలో సామాన్య ప్రజలు దాచుకున్న డిపాజిట్లను వడ్డీతో సహ వెంటనే చెల్లించాలని సీపీఐ(ఎం) రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి ముశం రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అమృతలాల్ శుక్లా కార్మిక భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సహారా ఇండియా యజమాని సుబ్రతారాయ్ సామాన్య ప్రజల నుండి అధిక వడ్డీ ఆశ చూపి వేలాది కోట్ల రూపాయలు వసూలు చేశారని రమేష్ విమర్శించారు. సిరిసిల్ల నియోజకవర్గంలోనే వేలాది మంది బాధితులు ఉన్నారని, ఒక్కొక్కరు రూ. 50 వేల నుండి రూ. 10 లక్షల వరకు భవిష్యత్తు అవసరాల కోసం, బిడ్డల పెళ్లిళ్ల కోసం దాచుకున్నారని తెలిపారు. కంపెనీ మూతపడి రెండేళ్లు గడుస్తున్నా బాధితులకు న్యాయం జరగకపోవడం దారుణమన్నారు. సహారా ఆస్తులన్నీ ప్రస్తుతం కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యవేక్షణలో ఉన్నాయని, వాటిని విక్రయించి బాధితులకు చెల్లించడంలో కేంద్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. కేవలం రూ. 50 వేలు మాత్రమే చెల్లిస్తూ చేతులు దులుపుకోవాలని చూడటం ప్రజల సొమ్మును ముంచే పక్కా ప్లాన్ లా కనిపిస్తోందని విమర్శించారు. ప్రధాని మోడీ గారు ఈ ఆస్తులను అదానీకి అప్పజెప్పే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. సహారా బాధితులు రోడ్లెక్కి పోరాటం చేస్తే తప్ప ప్రభుత్వంలో కదలిక రాదని, సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో దశలవారీ పోరాటాలు నిర్వహిస్తామని రమేష్ స్పష్టం చేశారు. ఇందులో భాగంగా మంగళవారం (మార్చి 24) నాడు ఆర్‌డీఓ గారికి వినతి పత్రం అందజేస్తున్నట్లు తెలిపారు. బాధితులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యురాలు జవ్వాజి విమల, జిల్లా కమిటీ సభ్యులు సూరం పద్మ, నాయకులు దాసరి రూప, ఆడెపు రజిత తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కార వేదిక 'ప్రజావాణి'

- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- జిల్లా కలెక్టరేట్‌లో 167 అర్జీల స్వీకరణ..
- త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశం

**నేటి సాక్షి, రాజన్న సిరిసిల్ల,(శివకుమార్):** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని త్వరితగతిన పరిష్కరించడమే లక్ష్యంగా 'ప్రజావాణి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో (×ణూజ) నిర్వహించిన ప్రజావాణిలో ఆమె పాల్గొని, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈరోజు జరిగిన ప్రజావాణిలో మొత్తం 167 అర్జీలు వచ్చాయి. వీటిని ఆయా శాఖల వారీగా కలెక్టర్ వర్గీకరించి, సంబంధిత అధికారులకు బదిలీ చేశారు. రెవెన్యూ శాఖ: 62, గృహ నిర్మాణ శాఖ: 28, డీఆర్డీఓ (DRDO): 19, జిల్లా పంచాయతీ కార్యాలయం: 09 పోలీస్ (SP కార్యాలయం), ఉపాధి కల్పన, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్: తలా 05 చొప్పున, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్: 04 వైద్యం, విద్య, సంక్షేమం, నీటి పారుదల, సెస్: తలా 03 చొప్పున. పౌర సరఫరాలు, మైనింగ్, లీడ్ బ్యాంక్, వేములవాడ ఆలయం: తలా 02 చొప్పున. మిగిలిన శాఖలకు సంబంధించి ఒక్కొక్కటి చొప్పున అర్జీలు అందాయి. అధికారుల సమన్వయం అవసరం. ప్రజల నుండి వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, చట్టపరిధిలో బాధితులకు న్యాయం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల మరియు వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాబాయ్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# భగత్ సింగ్ ఆశయ సాధనకు యువత నడుం బిగించాలి

### విద్య, ఉపాధి హక్కులకై పోరాడటమే ఆయనకు ఇచ్చే అసలైన నివాళి




**నేటి సాక్షి, సిరిసిల్ల,( శివకుమార్):** దేశ స్వాతంత్ర్యం కోసం అతి చిన్న వయసులోనే ఉరికంబాన్ని ముద్దాడిన విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల పోరాట స్ఫూర్తితో విద్య, ఉపాధి హక్కుల సాధనకై ఉద్యమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గాంతుల మహేష్ పిలుపునిచ్చారు. సోమవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 95వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించి, వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. భగత్ సింగ్ తన చిన్నతనం నుంచే స్వాతంత్ర్య పోరాట నేపథ్యం ఉన్న కుటుంబంలో పెరిగి, దేశ విముక్తి కోసం అంకితమయ్యారని గుర్తుచేశారు. 'ఇంక్విలాబ్ జిందాబాద్' అనే నినాదంతో దేశ యువతను ఏకం చేసి, బ్రిటిష్ సామ్రాజ్యవాదుల గుండెల్లో వణుకు పుట్టించారని కొనియాడారు. జలియన్ వాలాబాగ్ మారణకాండ, చౌరీ చౌరా వంటి ఘటనలు ఆయనలో విప్లవ సెగలు నింపాయని, కేంద్ర అసెంబ్లీపై బాంబు వేసి తన నిరసనను ప్రపంచానికి చాటారని తెలిపారు. నేటి పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాడాలని వారు పిలుపునిచ్చారు. 1931 మార్చి 23న బ్రిటిష్ ప్రభుత్వం వారిని ఉరితీసినా, వారి ఆశయాలు నేటికీ సజీవంగా ఉన్నాయని అన్నారు. విద్యార్థులు, యువత వారి బాటలో నడిచి హక్కుల కోసం గళమెత్తాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జాలపల్లి మనోజ్ కుమార్, శ్రీరాముల సంజన, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రమేష్, కార్యదర్శి రమణ, ఐద్వా కార్యదర్శి విమల పాల్గొన్నారు. అలాగే ఎస్ఎఫ్ఐ నాయకులు నవీన్, సతీష్, శివ, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యక్తి ఆత్మహత్య



**నేటి సాక్షి, అనంతగిరి:** మద్యానికి బానిసైన ఓ వ్యక్తి కుటుంబ సభ్యులు మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదనే క్షణికావేశంతో పురుగుల మందు తాగి మృతి చెందిన విషాద ఘటన సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల పరిధిలోని కొత్తగోల్ తండాలో సోమవారం చోటుచేసుకుంది. అనంతగిరి ఎస్సై నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగోల్ తండాకు చెందిన భానోతు బాలాజీ (56) గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 19న ఉగాది పండుగ రోజు నుండి బాలాజీ విపరీతంగా మద్యం తాగుతున్నాడు. ఈ క్రమంలో మద్యం సేవించడానికి కుటుంబ సభ్యులను డబ్బులు అడగ్గా, వారు నిరాకరించారు. దీంతో మనస్తాపానికి గురైన బాలాజీ క్షణికావేశంలో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మెరుగైన చికిత్స నిమిత్తం సూర్యాపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బాలాజీ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా నిర్వహించారు. మృతుడు బాలాజీకి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య భానోతు సాలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్ కుమార్ వెల్లడించారు.

# రాజంపేటలో పరిశుభ్రతపై యాక్షన్ మోడ్

### సర్పంచ్ బుర్స పోచయ్య, వార్డు సభ్యుడు గులాం జావిద్ పర్యవేక్షణ



**నేటి సాక్షి, కొమరం భీం ఆసిఫాబాద్ :** రాజంపేట గ్రామపంచాయతీలో పరిశుభ్రత కార్యక్రమాలు వేగవంతం అయ్యాయి. గ్రామంలోని డ్రైనేజీల శుభ్రపరిచే పనులు, పారిశుద్ధ్య చర్యలను సర్పంచ్ బుర్స పోచయ్య మరియు వార్డు సభ్యుడు గులాం జావిద్ స్వయంగా పరిశీలించారు. గ్రామంలో ఎక్కడా మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. పనుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీలను పూర్తిగా శుభ్రపరచాలని, ప్రతి వీధిలో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలనే లక్ష్యంతో పనులు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యం ప్రథమ ప్రాధాన్యమని, రాజంపేటను పరిశుభ్రమైన గ్రామంగా తీర్చిదిద్దడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు కూడా పరిశుభ్రతలో భాగస్వాములు కావాలని, చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు.



## గాలికుంటు నివారణ టీకాలు

**నేటి సాక్షి, గన్నేరువరం,(బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండల కేంద్రంలో సోమవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ రంగన్నవేణి లచ్చినర్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువులకు సోకే ప్రమాదకరమైన గాలికుంటు వ్యాధిని అరికట్టేందుకు ప్రభుత్వం ఉచితంగా టీకాలను సరఫరా చేస్తోందని తెలిపారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఆవులు, గేదెలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ డైరీ గ్రామ శాఖ అధ్యక్షులు మూల రామ్ రెడ్డి, ప్రియా డైరీ అధ్యక్షులు చింతల నరసింహారెడ్డి పాల్గొన్నారు. వైద్య సిబ్బందిలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ కరుణాకర్, డాక్టర్ సురేందర్ రెడ్డి, బుర్ర దేవరాజ్, అజయ్ తదితరులు పాల్గొని పశువులకు టీకాలు వేశారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



**నేటి సాక్షి, గజ్వేల్ :** గజ్వేల్ మండలం రిమ్మనగూడ గ్రామంలో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా మంజూరైన రూ. 60,000 విలువైన చెక్కును సోమవారం లబ్ధిదారుడు దోకి రమేష్‌కు అందజేశారు. గ్రామ సర్పంచ్ మల్కగల్ల కరుణాకర్ మరియు ఉపసర్పంచ్ రాచకొండ నర్సింలు కలిసి ఈ చెక్కును అధికారికంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కరుణాకర్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ గొప్ప భరోసానిస్తుందని తెలిపారు. అనారోగ్య కారణాలతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న ఈ సాయం ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు మరియు యువకులు పాల్గొని లబ్ధిదారుడికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ సహాయం పట్ల లబ్ధిదారుడు దోకి రమేష్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఎస్సీ కార్పొరేషన్ గడువు పెంచాలి



**నేటి సాక్షి, నల్లబెల్లి :** వరంగల్ జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకునే గడువును పొడిగించాలని తెలంగాణ దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం నల్లబెల్లి మండల కేంద్రంలోని సబ్ పోస్ట్ ఆఫీస్ ద్వారా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదకు ఈ మేరకు విజ్ఞాపన పత్రాన్ని పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని 13 మండలాల్లో ఎస్సీ నిరుద్యోగ యువతకు రుణాలు అందించేందుకు ఈ నెల 24వ తేదీని చివరి గడువుగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ప్రకటించారని తెలిపారు. అయితే, దరఖాస్తుకు అవసరమైన కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాలు తహసీల్దార్ కార్యాలయాల నుండి రావడానికి సమయం పడుతోందని, దీనివల్ల చాలా మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లబ్ధిదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గడువును పొడిగించాలని, అలాగే యూనిట్ల సంఖ్యను కూడా పెంచాలని కలెక్టర్‌ను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పరికి రత్నం, బిక్షపతి, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిపై హెచ్చరిక బోర్డు



**నేటి సాక్షి, నారాయణపేట,(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రం నుండి నారాయణపేట వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ భూమి 'తొల్లబండ' కబ్జాపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. గతంలో కొందరు వ్యక్తులు ఈ ప్రభుత్వ స్థలాన్ని అక్రమంగా కబ్జా చేసి, రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారనే అంశంపై సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి. వెంకటేష్ ఆధ్వర్యంలో మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వచ్చిన ఫిర్యాదును సీరియస్‌గా తీసుకున్న మరికల్ తహసీల్దార్ రామకోటి ఆదేశాల మేరకు, రెవెన్యూ అధికారులు సోమవారం సర్వే నంబర్ 212లో గల తొల్లబండ స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వే నిర్వహించారు. ఈ భూమి ప్రభుత్వానిదేనని తేలడంతో, మరికల్ జీపీఓ వెంకటప్ప ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది శ్రీనివాసులు, రఘు ఇతర సిబ్బందితో కలిసి అక్కడ ప్రభుత్వ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ స్థలంలోకి ఎవరూ అక్రమంగా ప్రవేశించకూడదని, కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

# చెన్నూర్ మద్యం సిండికేట్ మాఫియా వెనుక ఎవరు..

- ధాబాల పేరుతో జోరుగా విక్రయాలు.. పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు



**నేటి సాక్షి, మంచిర్యాల:** మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండల కేంద్రంతో పాటు కోటపల్లి మండలంలోని పలు గ్రామాల్లో మద్యం విక్రయాలు నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్నాయి. వైన్ షాపుల యజమానులందరూ ఒక సిండికేట్‌గా ఏర్పడి, ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. చెన్నూర్‌కు చెందిన ఒక వ్యక్తి ఆధ్వర్యంలో ఈ సిండికేట్ నడుస్తున్నట్లు సమాచారం. గత కొన్నేళ్లుగా సాగుతున్న ఈ అక్రమ దందాపై ఎక్సైజ్ శాఖ అధికారులు కనీసం కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

### గ్రామాల్లో బెల్ట్ షాపుల జోరు

చెన్నూర్ మండలంలోని ఒక్కో గ్రామంలో సగటున 50కి పైగా బెల్ట్ షాపులు నడుస్తున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రతి క్వార్టర్, బీరుపై ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే రూ. 20 నుండి రూ. 50 వరకు అదనంగా వసూలు చేస్తూ సామాన్యుల జేబులకు చిల్లులు వేస్తున్నారు. ఈ బెల్ట్ షాపులన్నీ సదరు సిండికేట్ వ్యక్తి కనుసన్నల్లోనే నడుస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.

### ధాబాలే 'మినీ' బ్రాందీ షాపులు

హైవేల పక్కన పర్మిషన్ లేని ధాబాలు చిన్నపాటి బ్రాందీ షాపులను తలపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం ఎంఆర్‌పీ (MRP) కంటే ఒక్క రూపాయి కూడా ఎక్కువ తీసుకోకూడదు. కానీ, ఇక్కడ సిండికేట్ మాఫియా ఇష్టానుసారంగా ధరలు పెంచి విక్రయిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఈ మద్యం సిండికేట్ వ్యవహారాన్ని అరికట్టాలని, అనుమతి లేని ధాబాలపై చర్యలు తీసుకోవాలని చెన్నూర్ మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# గజ్వేల్‌లో తెలంగాణ రన్ ప్రోమో రన్



- ఆరోగ్య తెలంగాణే లక్ష్యం
- ఏప్రిల్ 12న నిర్వహణ.. తరలిరావాలని నిర్వాహకుల పిలుపు

**నేటి సాక్షి, గజ్వేల్ :** "ఆరోగ్యమే మహాభాగ్యం" అనే సందేశాన్ని చాటిచెబుతూ, తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'తెలంగాణ రన్'కు అనుబంధంగా గజ్వేల్ పట్టణంలో ప్రోమో రన్‌ను ఘనంగా నిర్వహించనున్నారు. ఏప్రిల్ 12, ఆదివారం ఉదయం 6 గంటలకు ఈ ప్రోమో రన్ ప్రారంభమవుతుందని నిర్వాహకులు వెల్లడించారు. శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలనే అవగాహన కల్పించడమే ఈ రన్ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, వ్యాపారులు మరియు అన్ని వర్గాల ప్రజలు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమ నిర్వహణకు స్థానిక దాతలు అండగా నిలిచారు. అల్పాహార ఏర్పాట్ల కోసం కేఎంఆర్ ఫంక్షన్ హాల్ అధినేత మహిపాల్ రెడ్డి రూ. 30,000, నిధి పాలీమర్స్ శ్రీనివాస్ రూ. 20,000, మరియు శాంత ఫార్మసీ ఆంజనేయులు రూ. 10,000 విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నిఖిల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, సత్యం, జంగం రమేష్ గౌడ్, కోటె స్వామి, లింగారెడ్డి మరియు ఇతర సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. గజ్వేల్ ప్రజలందరూ ఈ ఆరోగ్య యజ్ఞంలో భాగస్వాములు కావాలని వారు కోరారు.

# గర్భిణీలకు నాణ్యమైన సేవలు అందించండి





- మాతా శిశు కేంద్రం తనిఖీలో కలెక్టర్
- గజ్వేల్ మాతా-శిశు ఆరోగ్య కేంద్రంలో సేవలు మెరుగుపరచాలి: సహజ ప్రసవాలు పెంచాలని కలెక్టర్ హైమావతి ఆదేశం

**నేటి సాక్షి గజ్వేల్ :** గజ్వేల్ పట్టణంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు అందుతున్న వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆసుపత్రి నిర్వహణపై పలు కీలక సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేద గర్భిణీ స్త్రీలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ఆధునిక సదుపాయాలతో ఆసుపత్రులను ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. ఆ సదుపాయాలను సద్వినియోగం చేస్తూ డాక్టర్లు, నర్సులు, ల్యాబ్ సిబ్బంది ప్రతి ఒక్కరూ గర్భిణీలకు ఓపికగా, బాధ్యతతో వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఆసుపత్రిలోని అన్ని వార్డులను సందర్శించిన కలెక్టర్, పుట్టిన శిశువులకు సమయానికి టీకాలు అందుతున్నాయా అనే విషయాన్ని పరిశీలించారు. తల్లి-శిశువులకు పరిశుభ్రమైన వాతావరణంలో మెరుగైన వైద్యం అందించాలనీ, వార్డుల్లో అవసరమైన సౌకర్యాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. గర్భిణీ స్త్రీల్లో మనోధైర్యాన్ని పెంపొందించేందుకు సరైన ఆహారపు అలవాట్లు, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించాలని, యోగా వంటి కార్యక్రమాలను ప్రోత్సహించాలని డాక్టర్లకు సూచించారు. ముఖ్యంగా సహజ ప్రసవాల సంఖ్యను పెంచడంపై దృష్టి పెట్టాలని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే శస్త్రచికిత్సలు చేయాలని స్పష్టం చేశారు. ఆసుపత్రిలో కొంతమంది డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని కలెక్టర్ తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సేవల నాణ్యతను మెరుగుపరచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. అటెండెన్స్ రిజిస్టర్‌ను తనిఖీ చేసిన కలెక్టర్, పై అధికారుల అనుమతి లేకుండా ఎవరూ సెలవులు తీసుకోకూడదని, తప్పనిసరిగా లీవ్ లెటర్ నమోదు చేయాలని ఆదేశించారు. ఆసుపత్రిలో శ్రద్ధగా విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు.

# కాగజ్‌నగర్ రోడ్డులో అగ్నిప్రమాదం

- వెంటనే స్పందించిన అటవీ శాఖ



**నేటి సాక్షి, కొమరం భీమ్ ఆసిఫాబాద్:** ఆసిఫాబాద్ ప్రతినిధి సిర్పూర్ (టి) నుంచి కాగజ్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కన గల అటవీ ప్రాంతంలో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఎండలు తీవ్రంగా ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించి అడవిలోని చెట్లు, వృక్షసంపద అగ్నికి ఆహుతయ్యాయి. రహదారికి ఆనుకునే మంటలు ఎగిసిపడటంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ప్రమాదాన్ని గమనించిన ప్రయాణికులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఎఫ్.డి.ఓ (ఖీణా) అప్పయ్య నేతృత్వంలో అటవీ సిబ్బంది యుద్ధప్రాతిపదికన ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలు అడవి లోపలికి వ్యాపించకుండా తమ సిబ్బందితో కలిసి శ్రమించి మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. అధికారుల సమయస్ఫూర్తితో అడవి భారీ నష్టం నుంచి తప్పించుకుందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎఫ్.డి.ఓ అప్పయ్య మాట్లాడుతూ.. అడవిలో ఇలాంటి అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని ఆయన సూచించారు.

TGTEL/25/A1737 | NETI SAKSHI

# కోరుట్ల పోలీసుల మెరుపు దాడులు



- రెండు పేకాట స్థావరాలపై రైడ్'లు.. పట్టుబడ్డ 11 మంది జూదరులు
- మాదాపూర్ రైల్వే బ్రిడ్జ్ సమీపంలో 4 గురు..కల్లూర్ రోడ్డు వద్ద 7 గురు పట్టివేత
- రూ.1,05,210 నగదు, 11 సెల్‌ఫోన్లు సీజ్ -- కేసులు నమోదు
- కోరుట్ల ఎస్సై నేతృత్వంలో కోరుట్ల పోలీస్, జగిత్యాల సీసీఎస్‌టీం ఆపరేషన్

**నేటి సాక్షి కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల మండలంలోని మాదాపూర్–కల్లూర్ గ్రామ శివారుల్లో పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు కోరుట్ల పోలీసులు–జగిత్యాల సీసీఎస్‌టీం సంయుక్తంగా రెండు రైడ్లు నిర్వహించి మొత్తం 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. మాదాపూర్ మామిడి తోటలో 4 గురు, కల్లూర్ రోడ్ వద్ద 7 గురు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.1,05,210 నగదుతోపాటు, 11 సెల్‌ఫోన్లు సీజ్ చేసి, అందరిపై కేసు నమోదు చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారని తెలుస్తోంది. కోరుట్ల ఎస్ఐ చిరంజీవి నేతృత్వంలో జరిగిన ఈ ఆపరేషన్ స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.!

### మాదాపూర్ రైల్వే బ్రిడ్జ్ సమీపంలో..

మాదాపూర్ గ్రామ శివారులోని మామిడి తోటలో (రైల్వే బ్రిడ్జ్ సమీపంలో) పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందడంతో కోరుట్ల పోలీస్–జగిత్యాల సీసీఎస్‌టీం సంయుక్తంగా దాడి చేశారు. ఈ రైడ్‌లో నాలుగుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారు.. పేరాల శరత్ బాబు..అబ్దుల్ రెహ్మాన్.. నాంపల్లి శ్రీధర్.. గాంధారి శ్రీనివాస్. వీరి వద్ద నుంచి రూ.98,200 నగదు,నాలుగు సెల్‌ఫోన్లు సీజ్ చేశారు. అందరిపై కేసు నమోదు చేసినట్లు కోరుట్ల ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

## కల్లూర్ రోడ్ వద్ద మరో రైడ్

### ఏడుగురి పట్టివేత -ముగ్గురు పరారీ

అదే రోజు సాయంత్రం కోరుట్లలోని ఆనంద్ నగర్ శివారులోని వ్యవసాయ భూమి వద్ద (కల్లూర్ రోడ్ సమీపంలో) పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు మళ్లీ కోరుట్ల పోలీస్–సిసిఎస్ టీమ్ దాడి చేశారు. ఈ ఘటనలో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు (మరో ముగ్గురు పరారీలో ఉన్నారు). పట్టుబడిన వారిలో పట్టాల గోపి, పూదరి శ్రీనివాస్, జక్కుల రవి, ఎండీ రగురొద్దీన్, లోకిని పోచయ్య, సెల్కే లక్ష్మణ్, ఆకునూరి వీరప్ప ఉన్నారు. వీరి నుంచి రూ.7,010 నగదు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అందరిపై కేసు నమోదు చేసినట్లు కోరుట్ల ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

# ధైర్యానికి ప్రతీక.. భగత్ సింగ్ అమర్ రహే!



- అమరవీరుల వర్ధంతి వేడుకల్లో సిపిఐ నేత బాతరాజు నర్సింహా
- భారతరత్న ఇవ్వాలని, పాఠ్యాంశాల్లో చేర్చాలని డిమాండ్
- సరూర్నగర్‌లో విప్లవ వీరులకు ఘన నివాళి

**ఎల్బీనగర్, మార్చి 23 (నేటి సాక్షి):**

భయం ఎరుగని భారతీయులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌లని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నర్సింహ పేర్కొన్నారు. సిపిఐ భగత్ సింగ్ నగర్ శాఖ సరూర్నగర్‌లో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల 95వ వర్ధంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాతరాజు నర్సింహ మాట్లాడుతూ, ఈ విప్లవ వీర కిశోరాలు విద్యార్థి దశ నుండే స్వాతంత్ర్య కాంక్షతో పోరాటం వైపు అడుగులు వేశారని కొనియాడారు. 1929లో పార్లమెంట్‌పై పొగ బాంబులు వేసి, కరపత్రాలు వెదజల్లి, 'విప్లవం వర్ధిల్లాలి', 'ఇంక్విలాబ్ జిందాబాద్' అంటూ నినాదాలు చేసి బ్రిటిష్ వారిని గడగడలాడించిన చరిత్ర వారిదని గుర్తు చేశారు.ధైర్యానికి ప్రతీక, దేశభక్తికి ప్రతిరూపమైన భగత్ సింగ్‌కు "భారత రత్న" పురస్కారం ఇవ్వాలని, ఆయన పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. భగత్ సింగ్ బలిదానం దేశంలో విప్లవ ఉద్యమాలను మరింత బలోపేతం చేసిందని, నేటి యువత ఆయన ఆశయ సాధన కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ప్రవీణ్ కుమార్ గౌడ్, ఆర్ గోపాల్, సిపిఐ రంగారెడ్డి జిల్లా సమితి సభ్యులు జిల్లాల కృష్ణ, ఎండి మహబూబ్, నరసమ్మ, సాయి, సాహెద్, ప్రసాద్, అమీద్, పరుశురాం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఓఆర్ఆర్ పై ప్రమాదం

### ఎమ్మెల్యే మాగంటి కూతుళ్లకు గాయాలు
### గచ్చిబౌలి నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్తుండగా ఘటన
### డీసీఎం వాహనాన్ని బలంగా ఢీకొన్న కారు
### పెద్ద కూతురు అక్షరకు తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు

**హైదరాబాద్, మార్చి 23 (నేటి సాక్షి):**




దివంగత బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కూతుళ్లు ప్రయాణిస్తున్న వాహనం ఓఆర్ఆర్ పై ప్రమాదానికి గురైంది. ఆదివారం రాత్రి మాగంటి కూతుళ్లు తమ స్నేహితులను ఎయిర్‌పోర్టులో వదిలి తిరిగి వస్తుండగా గచ్చిబౌలి నుంచి శంషాబాద్ వైపు వెళ్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. నార్సింగ్ పోలీస్ అకాడమీ సమీపంలో వీరి కారు ఒక డీసీఎం వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మాగంటి పెద్ద కూతురు అక్షరకు తీవ్ర గాయాలు కాగా, చిన్నకూతురుతో పాటు మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన వారు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అక్షర కోలుకుంటున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# అనుమానంతో భార్య హత్య..

### మూడేళ్ల చిన్నారిని వెంటబెట్టుకుని పొలాల్లో పడేసిన భర్త
### నిందితుడిని అరెస్టు చేసిన షాద్ నగర్ పోలీసులు

**రంగారెడ్డి, మార్చి 23 (నేటి సాక్షి):**

అనుమానం పెనుభూతమై ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకున్న ఘటన షాద్ నగర్ లో వెలుగుచూసింది. భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న నర్సింలు అనే వ్యక్తి తన భార్య శోభారాణిని గ్రానైట్ రాయితో తలపై కొట్టి అత్యంత కిరాతకంగా హతమార్చాడు. అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా రక్తపు మరకలను శుభ్రం చేసి, అర్ధరాత్రి సమయంలో మృతదేహాన్ని మూటకట్టి బైక్ పెట్రోల్ ట్యాంక్‌పై పెట్టుకున్నాడు. దానిపైనే తన మూడేళ్ల కుమార్తెను కూర్చోబెట్టుకుని రంగారెడ్డిగూడెం శివారులోని పొలాల్లో పడేసి పరారయ్యాడు. పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితుడిని లింగంపల్లిలో అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి హత్యకు వాడిన రాయి, ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

# డ్రగ్స్ కేసులో నిందితులకు మూడు రోజుల పోలీస్ కస్టడీ

### మొయినాబాద్ కేసులో ఉప్పర్‌పల్లి కోర్టు కీలక నిర్ణయం
### పైలెట్ రోహిత్‌రెడ్డి సహా ముగ్గురిని విచారించనున్న పోలీసులు

**హైదరాబాద్, మార్చి 23 (నేటి సాక్షి):**



రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మొయినాబాద్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అరెస్టయిన నిందితులు పైలెట్ రోహిత్‌రెడ్డి, రితేష్‌రెడ్డి, నమిత్ శర్మలను మూడు రోజుల పాటు పోలీస్ కస్టడీకి ఇవ్వడానికి ఉప్పర్‌పల్లి కోర్టు అనుమతి ఇచ్చింది. డ్రగ్స్ సరఫరా వెనుక ఉన్న నెట్‌వర్క్ గురించి మరిన్ని వివరాలు రాబట్టేందుకు పోలీసులు చేసిన అభ్యర్థనను న్యాయస్థానం మన్నించింది. రేపటి నుంచి నిందితులను కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు.

# ప్రైవేటు ఆస్పత్రిలో అగ్నిప్రమాదం.. తప్పిన ముప్పు

**హైదరాబాద్, మార్చి 23 (నేటి సాక్షి):**



మాసబ్ ట్యాంక్ పరిధిలోని విజయనగర్ కాలనీలో ఉన్న శ్రుతి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో అగ్నిప్రమాదం సంభవించింది. ఆస్పత్రి మూడో అంతస్తులో ఉన్న ఏసీ ఒక్కసారిగా పేలడంతో మంటలు చెలరేగాయి. దీంతో భయాందోళనకు గురైన రోగులు, సిబ్బంది వెంటనే బయటికి పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది.

# ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు హైకోర్టు నోటీసులు

### స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు కూడా నోటీసులు జారీ
### అనర్హత వేటు వేయాలన్న బీజేపీ పిటిషన్‌పై విచారణ
### తదుపరి విచారణ ఏప్రిల్ 16వ తేదీకి వాయిదా



**నేటి సాక్షి, హైదరాబాద్:**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ పై న్యాయస్థానం సోమవారం విచారణ చేపట్టింది. దానం నాగేందర్ పార్టీ మారిన వ్యవహారంలో స్పీకర్ తీర్పును కొట్టివేయాలని ఏలేటి తన పిటిషన్ లో కోరారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్.. కాంగ్రెస్ తరపున ఎంపీగా పోటీ చేశారని న్యాయస్థానం దృష్టికి ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీసుకెళ్లారు. ఇతర పార్టీ నుంచి నామినేషన్ వేసిన రోజు నుంచే ఆయన్ను అనర్హుడిగా ప్రకటించాలని విన్నవించారు. ఈ సందర్భంగా కర్ణాటక, బిహార్ రాష్ట్రాల్లో ఇలాంటి పిటిషన్లపై సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులను ఆయన ప్రస్తావించారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. కౌంటర్ దాఖలు చేయాలని దానం నాగేందర్ తో పాటు స్పీకర్ గడ్డం ప్రసాద్, అసెంబ్లీ కార్యదర్శికి నోటీసులు పంపింది. తదుపరి విచారణను ఏప్రిల్ 16వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం స్పష్టం చేసింది.

# పీజీ మెడికల్ సీట్ల భర్తీపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

### కౌన్సెలింగ్ పొడిగింపుపై జాతీయ మెడికల్ కమిషన్‌కు నోటీసులు
### సీట్లు వృథా కావొద్దన్న ధర్మాసనం.. విచారణ మంగళవారానికి



**నేటి సాక్షి, న్యూఢిల్లీ:**

తెలుగు రాష్ట్రాల్లోని పీజీ మెడికల్ సీట్ల భర్తీకి సంబంధించి కౌన్సెలింగ్ గడువు పొడిగింపుపై సుప్రీంకోర్టు సోమవారం కీలక విచారణ చేపట్టింది. ఈ ప్రక్రియలో సీట్లు వృథా కాకుండా చూడాలని, అర్హులైన విద్యార్థులు కోర్సుల్లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని ఈ సందర్భంగా ధర్మాసనం అభిప్రాయపడింది. కౌన్సెలింగ్ పొడిగింపునకు అనుమతి ఇవ్వకపోవడానికి గల కారణాలపై వివరణ ఇవ్వాలని జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ)ను సుప్రీంకోర్టు ఆదేశించింది. జస్టిస్ పీఎస్ నర్సింహ, జస్టిస్ అలోక్ అరాథేలతో కూడిన ధర్మాసనం ఈ అంశంపై విచారణ చేపట్టి.. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.ఖాళీగా ఉన్న పీజీ మెడికల్ సీట్ల భర్తీ కోసం వైద్య విద్యా కళాశాలల యాజమాన్యాలు ఇటీవల సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఫిబ్రవరి 28వ తేదీతో కౌన్సెలింగ్ గడువు ముగిసినప్పటికీ.. ఆంధ్రప్రదేశ్‌లో 246, తెలంగాణలో 377 పీజీ సీట్లు భర్తీ కాలేదని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఖాళీగా ఉన్న వాటిలో దాదాపు 45 కన్వీనర్ కోటా సీట్లు కూడా ఉన్నాయని యాజమాన్యాల తరపు న్యాయవాదులు ధర్మాసనానికి వివరించారు. గడువు పెంచాలని ఫిబ్రవరి 28వ తేదీకి ముందే జాతీయ మెడికల్ కమిషన్‌కు సంబంధిత విశ్వవిద్యాలయాలు, కళాశాలలు విజ్ఞప్తి చేసినట్లు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. విద్యార్థులు కళాశాలల్లో చేరేందుకు ఆసక్తిగా ఉన్నా.. కమిషన్ నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో కౌన్సెలింగ్ ముగించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. దీనివల్ల వందలాది సీట్లు భర్తీ కాకుండా మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

# అసెంబ్లీలో విపక్షాల నిలదీత

### రైతు సమస్యలపై చర్చ
### వరి కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలి: పల్లా
### నిమ్స్‌లో మందుల ధరలు తగ్గించాలి: ఎమ్మెల్సీ రమణ

**నేటి సాక్షి, హైదరాబాద్:**



శాసనసభ, మండలి సమావేశాల్లో ప్రతిపక్ష నేతలు ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. నిమ్స్, గాంధీ, ఉస్మానియా వంటి ఆస్పత్రుల్లో మందుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని ఎమ్మెల్సీ ఎల్. రమణ విమర్శించారు. పేద రోగుల కోసం ప్రభుత్వమే మందులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు, వరి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి కోరారు. సన్న వడ్ల బకాయిలు 1200 కోట్లు ఎప్పుడు చెల్లిస్తారని ప్రశ్నించారు. హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి విమర్శించారు